# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 273 | హైదరాబాద్ | శనివారం 25-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

హుగ్లీ నదిలో ప్రధాని నరేంద్ర మోదీ పడవ ప్రయాణం

## కొత్త AI 'మిథోస్' కలకలం..
# బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

- 'క్లాడ్ మిథోస్' అనే కొత్త AI సైబర్ భద్రతకు ముప్పుగా మారిందన్న ఆందోళనలు
- నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో ఉన్నతస్థాయి సమావేశం
- దశాబ్దాల నాటి లోపాలను సైతం ఈ AI గుర్తించగలదని నిపుణుల హెచ్చరిక
- ముప్పును ఎదుర్కొనేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బ్యాంకులకు ఆదేశం

11లో





## చర్చలే మార్గం..
# ఆత్మహత్యలు వద్దు

- మంత్రుల బృందంతో జేఏసీ నేతల భేటీ
- డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మల్లు భట్టి
- ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ

11లో



తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఓటింగ్ శాతం పెరగడం శుభపరిణామమన్న రాంచందర్ రావు

11లో




## ట్రంప్‌కు ముంబైలోని
# ఇరాన్ ఎంబసీ వీడియోతో కౌంటర్

- ట్రంప్ ఒకసారి భారత్ వచ్చి చూడాలని సూచన
- భారతదేశంలో అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌కు తెలిసేలా వీడియో
- మహారాష్ట్రలోని భవనాలు, సుందర ప్రదేశాలను షేర్ చేసిన ఎంబసీ

11లో

## మొజ్తబా ఖమేనీకి
# ప్లాస్టిక్ సర్జరీ?

- తీవ్ర గాయాలతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ
- ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిన వైనం
- భవిష్యత్తులో ఆయన ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం
- రహస్య లేఖల ద్వారా దేశాన్ని పాలిస్తున్నారని



వెల్లడించిన 'ది న్యూయార్క్ టైమ్స్'

- అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి.. కీలక నిర్ణయాలన్నీ వారే తీసుకుంటున్నారని వెల్లడి

11లో



## మే 4 తర్వాత లెక్క తేలుస్తాం
# మోదీ హెచ్చరిక

- బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారన్న మోదీ
- బీజేపీ ప్రభుత్వం వచ్చాక టీఎంసీ దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్ బయటకు తీస్తామన్న మోదీ
- తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అని ఆరోపణ

11లో

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు
## హైకోర్టులో భారీ ఊరట

- 2011 మిలియన్ మార్చ్ కేసులను కొట్టివేసిన హైకోర్టు
- ట్యాంక్‌బండ్‌పై నాడు నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్తత






11లో

## శంకర్ గౌడ్ ది సర్కార్ హత్యే: కేటీఆర్

- ఈ ఉదయం మృతి చెందిన శంకర్ గౌడ్
- పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు అనుమతించకపోవడం దుర్మార్గమన్న కేటీఆర్
- అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

## నిబంధనలు గాలికి..
# నివాసితులకు ప్రాణసంకటం!

NAMISHREE
INFRASTRUCTURE & PROJECTS PVT. LTD.

- లింగోజిగూడలో 'నమిశ్రీ జ్యేల్' అక్రమ తవ్వకాలు
- లోతైన సెల్లార్‌తో కుంగుతున్న పక్కనే ఉన్న ఇళ్లు
- భారీ క్రేన్ల హోరు.. దుమ్ము ధూళితో ఉక్కిరిబిక్కిరి
- వ్రాతపూర్వ ఫిర్యాదు చేసినా.. ఎల్బీనగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ పట్టించుకోని అధికార యంత్రాంగం.. దిక్కుతోచని స్థితిలో మైత్రినగర్ వాసులు



12లో

భారత శక్తి

# బీజేపీకి రాహుల్ బలం...

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. "గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు.కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది.జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్–బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు.ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు.ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరెటివ్‌ను తయారు చేస్తుంది. మొత్తానికి బీజేపీ బిల్లుల విషయంలో ఓడిపోయినప్పటికీ, రాజకీయ వ్యూహాల్లో మాత్రం గెలిచిందని చెబుతున్నారు.

===============

# పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోండి...

## 28 కేటగిరిలలో ఫించన్లు

విజయవాడ, ఏప్రిల్ 24,

ఏపీ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ నుంచి కొత్తవారికి పింఛన్లు ఇవ్వాలని కసరత్తు చేస్తున్నారు. ముందుగా వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. మొత్తం 1.53 లక్షల మంది అర్హులని అంచనా వేస్తున్నారు. జూన్ నెలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న సందర్భంగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. వితంతువుల తర్వాత దివ్యాంగులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే తీపికబురు చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారికి ఊరట కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి.. ముందుగా అర్హులైన వారికి వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జూన్ 12కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతోంది. ఆ రోజు నుంచి వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 1.53 లక్షలమంది వితంతు పింఛన్‌లకు అర్హులు ఉంటారని అంచనాలు ఉన్నాయి. వీరందరికి కొత్తగా పింఛన్లు నెలకు రూ.4 చొప్పున ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ 1.53 లక్షలమందికి పింఛన్ల కోసం నెలకు రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఇప్పటికే పింఛన్ తీసుకునే భర్త చనిపోతే.. వారి స్థానంలో భార్యకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ ఇస్తోంది. ఈ ప్రక్రియ ప్రతి నెలా కొనసాగుతోంది.. కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. వెంటనే భార్య పేరు మీద ఆ తదుపరి నెల నుంచి రూ.4వేలు చొప్పున రుణం మంజూరు చేస్తోంది. ఇలా మొత్తం 2.30 లక్షలమందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అయితే 60 ఏళ్లలోపు మగవారికి పింఛన్లు రావు.. ఒకవేళ భర్త చనిపోతే భార్య వితంతు కింద పింఛన్ మంజూరు చేస్తారు. అందుకే వీరందరికి ముందుగా వితంతు కేటగిరీలో కొత్త పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది.వితంతు కేటగిరిలో పింఛన్లు మంజూరు చేసిన తర్వాత అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దివ్యాంగుల కేటగిరిలో ఏకంగా లక్షమంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దివ్యాంగుల కోటాలో ప్రస్తుతం 6.50 లక్షలమంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీరిలో ఓ లక్షమంది వరకు అనర్హులు ఉన్నారు.. ఈ లక్షమంది అనర్హుల్ని ఎలా నిరోధించాలని కసరత్తు జరుగుతోంది. ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటుగా ఆరోగ్య పింఛన్లతో కలిపి 28 కేటగిరీల్లో పంపిణీ చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దాదాపు 10 లక్షలమంది వరకు దరఖాస్తు చేసుకునే ఛాన్స్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి పింఛన్లు ఇవ్వాలంటే నెలకు రూ.400 కోట్లు.. అదే ఏడాదికి అయితే రూ.4,800 కోట్లు ఖర్చవుతుందనే అంచనాలు ఉన్నాయి. మొత్తం మీద కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లకు సంబంధించి కసరత్తు మొదలుపెట్టింది. త్వరలోనే కొత్త పింఛన్ల అంశంపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.. జూన్ నాటికి అర్హులకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.

వితంతవులు, దివ్యాంగులకు..

ఏపీలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారికి గుడ్ న్యూస్. జూన్ నుంచి కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.కూటమి వచ్చిన తర్వాత కేవలం స్పౌజ్ పింఛన్లు మాత్రమే అందించింది. కానీ కొత్తగా వితంతు పింఛన్లు ఇంతవరకు అందించలేదు. దీంతో ముందుగా వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.53 లక్షల మంది వితంతు పింఛన్లకు అర్హులుగా తేలింది. కూటమి అధికారంలోకి వచ్చి జూన్ నాటికి రెండేళ్లు పూర్తవుతుంది.. ఆ సందర్భంగా వితంతు పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వితంతువులకు పూర్తయిన తర్వాత దివ్యాంగులకు సైతం కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉంది. క్రమేపి పురుషుల్లో కూడా కొత్తవారికి, ఓల్డ్ ఏజ్ పెన్షన్లు అందించనుంది ప్రభుత్వం.ఈ ఏడాది జూన్ 12 నాటికి కూటమి అధికారంలోకి వచ్చి రెండేళు పూర్తవుతుంది. ఆ రోజు నుంచి వితంతు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మొత్తం 1.53 లక్షల మంది వితంతు పింఛన్లకు అర్హులు అని అంచనాలు ఉన్నాయి. వీరందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్న ఆలోచనలో ఉంది ప్రభుత్వం. నాలుగు వేల రూపాయల చొప్పున వీరికి పింఛన్ మొత్తం అందనుంది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతినెల రూ.61 కోట్లు అదనపు భారం పడనుంది.. అయితే కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందుకే ఇప్పుడు ముందుగా వితంతువులకు, తర్వాత దివ్యాంగులకు, చివరిగా ఓల్డ్ ఏజ్ వారికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిర్ణయం తీసుకుంది. భర్త చనిపోతే ఆ నెల నుంచి భార్యకు పింఛన్ వర్తింపజేశారు. ఇలా ఇప్పటివరకు 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందజేశారు. అయితే వితంతువులు లక్షలాదిమంది పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకే వారికి ముందుగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు దివ్యాంగులకు సైతం అందించేందుకు నిర్ణయించింది ప్రభుత్వం. దివ్యాంగుల కోటాలో ఏకంగా లక్ష మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 6.50 లక్షల మంది దివ్యాంగులు పింఛన్లు తీసుకుంటున్నారు. మొత్తానికైతే ఏపీలో కొత్త పింఛన్ల ప్రక్రియ అప్పుడే ప్రారంభం అయ్యింది.

# సీ ప్లేన్ తో పర్యటకానికి ఊపు

విశాఖపట్టణం, ఏప్రిల్ 24,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీప్లేన్ సేవలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమైంది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండుచోట్ల ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తి చేశారు. అల్లూరి జిల్లాలోని సీలేరు, జోలాపుట్టు ప్రాంతాల నుంచి సీప్లేను నడిపేందకు ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీప్లేన్‌లు నడిపేందుకు సిద్ధమైంది.. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల కూడా సీప్లేన్‌లు నడిపేందుకు కసరత్తు చేస్తోంది. అమరావతి, తిరుపతి, గండికోట ప్రాంతాలలో సీప్లేన్ ప్లాన్ చేశారు. అయితే ఉత్తరాంధ్రలోని ప్రకృతి అందాలకు, పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీప్లేన్‌లు నడపాలని నిర్ణయింది. అల్లూరిసీతారామరాజు జిల్లాలో నీటిపై తేలుతూ, గాల్లో ఎగురుతూ ప్రకృతి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. సీప్లేన్ సర్వీసులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.జిల్లాలో సీప్లేన్‌లను జోలాపుట్టు, సీలేరు ప్రాంతాల నుంచి నడిపేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. సీలేరులోరూ. 16.08 కోట్లు.. జోలాపుట్టులో రూ. 16 కోట్లతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సీలేరులో ఉన్న గుంటవాడ జలాశయం దగ్గర ఉన్న మారెమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. అక్కడ సమీపంలోనే భూమిని ఈ సీప్లేన్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇక జోలాపుట్టు జలాశయం దగ్గర సీప్లేన్ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్‌లో విశాఖపట్న నుంచి ముంచంగిపట్టు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ మార్గంలో అరకు అందాలను వీక్షించవచ్చు. లంబసింగి, చింతపల్లి, సీలేరు ప్రాంతాలను.. గిరిజన సంప్రదాయాలు, జీవనశైలిని చూస్తూ అలా సీలేరులో ఏర్పాటు చేసే వాటర్ ఏరోడ్రోమ్ చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.సీప్లేన్ కోసం ఏరోడ్రోమ్‌లు ఏర్పాటు చేస్తే.. దాని చుట్టూ రెస్టారెంట్లు, భవనాలు, రెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువమంది వస్తుంటారు. ఈ సీప్లేన్‌లు అందబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రెండుచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌లు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మొత్తం మీద ఉత్తరాంధ్రలోని మన్యంలో రెండుచోట్ల సీప్లేన్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.. త్వరలోనే ఈ ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.

# రైల్వే శాఖ నిర్లక్ష్యం::: గేట్ వద్ద తృటిలో తప్పిన ప్రమాదం

ఏప్రిల్ 24, సూళ్లూరుపేటలోని రైల్వే గేట్ వద్ద గురువారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. రైలు సమీపిస్తున్న సమయంలో గేటు మూసే ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ అది పూర్తిగా మూసుకోకపోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గేటు సరిగా లాక్ అవకపోవడంతో కొంతసేపు వాహనదారులు ట్రాక్ సమీపంలోనే ఉండాల్సి వచ్చింది.అయితే అప్రమత్తంగా వ్యవహరించిన వాహనదారులు పరిస్థితిని గమనించి వెంటనే వెనక్కి తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షణాల వ్యవధిలోనే రైలు దూసుకువచ్చిన నేపథ్యంలో,ఈ ఘటన చూసిన వారిలో భయాందోళనలు నెలకొన్నాయి.స్థానికుల సమాచారం తో ఈ రైల్వే గేట్ వద్ద ఇలాంటి సాంకేతిక సమస్యలు తరచూ తలెత్తుతున్నాయని, గేటు మూసే వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రతిరోజూ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ట్రాక్ దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని చెబుతున్నారు.రైల్వే శాఖ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నప్పటికీ అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు వెంటనే స్పందించి గేటు మరమ్మతులు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

==============================

# 10ట్రాక్టర్ బోల్తా? డ్రైవర్ మృతి

ఏలూరు జిల్లా ఏప్రిల్ 24,

ఏలూరు జాతీయ రహదారిలో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి వంతెన పై నుండి కిందకు పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం ఏలూరు చింతలపూడి రోడ్డు లో జరిగింది.మృతుడు నందివాడకు చెందిన మందపాటి నాగరాజుగా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుమొబైల్ సేఫ్టీ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు

# విజయవాడలో నకిలీ అధికారుల అరెస్ట్

ఏప్రిల్ 24,

విజయవాడలో నలుగురు నకిలీ అధికారులను పోలీసులు అరెస్ట్ చేశారు. పటమటలోని ఓ షాప్ వద్దకు గొల్లపూడికి చెందిన నలుగురు నకిలీ అధికారాలు వెళ్లారు..తాము క్రైమ్ గ్రీవలెన్స్ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వచ్చామని దుకాణంలో తనిఖీలు చేయాలి.. సరకుల నాణ్యత సరిగా లేదని, బరువు తక్కువగా ఉన్నాయని ఫిర్యాదులొచ్చాయంటూ హడావుడి సృష్టించి నగదు డిమాండ్ చేశారు... బాధితుడు అనుమానం తో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని అదుపులోకి తీసుకున్నారు...

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..


శ్రీకాకుళం, ఏప్రిల్ 24,

ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వానికి కూడా త్వరలో లేఖ రాయనున్నారు.శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదరు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహా ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.శ్రీకాకుళం జిల్లాలో ఈ నేరడి బ్యారేజి ఆలస్యంకావడంతో నీళ్ల మళ్లింపు కోసం సైడ్ వియర్ నిర్మించారు.. కానీ ఆ ప్రయత్నం విజయవంతంకాలేదు. హిరమండలంలో ఎత్తిపోతలను ప్లాన్ చేసి.. మొత్తం 19.5 డీఎంసీల నీళ్లు మళ్లించాలని భావించారు.. కానీ ఆ నిర్మాణం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఇప్పుడు నేరడి బ్యారేజి పనులు చేపట్టి పూర్తిచేస్తే తొలిదశలో లక్షా 48వేల ఎకరాలకు నీళ్లు అందించొచ్చని చెబుతున్నారు. రెండో రెండో దశలో మరో లక్షా 7వేల 280 ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చంటున్నారు. సాగునీరుతో పాటుగా తాగునీటి సమస్య కూడా తీరుతుందని.. వంశధార–నాగావళి అనుసంధానం పలితాలు దక్కుతాయంటున్నారు.శ్రీకాకుళం జిల్లా భామిని మండలం నేరడి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి 1961లో తొలి అడుగు పడింది.. అప్పటి నుంచి కోర్టు చిక్కులతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేరడి బ్యారేజీ అంశం గురించి కేంద్రంతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లిన సమయంలో కేంద్ర జలశక్తిమంత్రి, ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల నేరడి బ్యారేజ్‌కు సంబంధించి.. వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చేసింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరినవాటిని పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది. త్వరలోనే ఒడిశా ప్రభుత్వానికి లేఖ రాసే అవకాశం ఉందంటున్నారు.

==========================

# చంద్రబాబు బయోపిక్ అడుగులు

విజయవాడ ఏప్రిల్ 24, (న



తెలుగు రాజకీయ నేతల బయోపిక్ లు మంచి ఆదరణ పొందాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్ యాత్ర సినిమా ద్వారా తెరకెక్కించారు. విశేష ప్రేక్షకాదరణ పొందింది ఆ చిత్రం. ఎన్టీఆర్ కథానాయకుడు, నాయకుడు పేరిట బయోపిక్ వచ్చింది. ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ పాత్రలో మెప్పించారు. అయితే ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు బయోపిక్ రానుంది. చంద్రబాబు జీవితంలోని ముఖ్యమైన సంఘటనల ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ మేరకు దర్శకుడు భానుశంకర్ ప్రకటన చేశారు. రాజధాని ఫైల్స్ చిత్రంతో అమరావతి రైతుల త్యాగాన్ని, రాజధాని అవసరాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు దర్శకుడు భాను ప్రకాష్. ఆ చిత్రంతో బాగానే మెప్పించారు. ఇప్పుడు చంద్రబాబు బయోపిక్ తీయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా చంద్రబాబు రాజకీయ జీవితం అంటే చాలా రకాల పాత్రలు ఉంటాయి. దీంతో చంద్రబాబు పాత్ర ఎవరు పోషిస్తారు? మిగతా పాత్రధారులు ఎవరు? అనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది.సామాన్యుడిగా జీవితం ప్రారంభించి.. విద్యార్థి సంఘ నేతగా ఎదిగి.. రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబు( రాణించిన తీరు భిన్నంగా ఉంటుంది. ఆయన ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదే. అయితే చంద్రబాబును సినిమాలో ఎలా చూపిస్తారు అనేది ఇప్పుడు ఆసక్తి. చంద్రబాబు జీవితంలో జరిగిన ప్రతి ఘట్టంలో ఒక ఉద్వేగం, ఒక సంఘర్షణ దాగి ఉంది. దానిని బయోపిక్ లో చూపిస్తాను అంటున్నారు దర్శకుడు భాను ప్రకాష్.. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, నిర్మాణ సంస్థ వివరాలు, షూటింగ్ విశేషాలు, ఇతర సమాచారం త్వరలో వెల్లడిస్తానని చెబుతున్నారు భాను ప్రకాష్. చంద్రబాబు పాత్రలో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. ఎన్టీఆర్ బయోపిక్ లో చంద్రబాబు పాత్రధారిగా దగ్గుబాటి రానా నటించారు. అయితే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన సినిమాల్లో చంద్రబాబు పాత్రధారి బాగా ఆకట్టుకున్నారు. ఆయన అయితే అచ్చం గుద్దినట్టు సరిపోతారు అనేది ఒక అంచనా. మరోవైపు ఇతర నేతలు, ముఖ్యుల పాత్రల కోసం ఎవరిని ఎంపిక చేస్తారు అనేది ప్రశ్న. చిన్న స్థాయి నుంచి ప్రారంభమైన చంద్రబాబు ప్రయాణం.. క్రమంగా రాజకీయాల్లో ఎదుగుతూ రాష్ట్ర నాయకుడిగా మారిన తీరు ఈ సినిమా ఇతివృత్తం. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రజల కోసం చేసిన పనులు వంటి వాటిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారట. ముఖ్యమంత్రిగా సాధించిన మైలురాళ్లు, ప్రతిపక్ష నేతగా చేసిన యాత్రలు, నందమూరి కుటుంబంతో ఉన్న అనుబంధం, అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడి, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అరెస్టు.. ఇలా అన్ని ఎపిసోడ్లు ఉండనున్నాయని తెలుస్తోంది.

# ఒంటిమిట్ల రామాలయ పూజరులకు నోటీసులు

కడప, ఏప్రిల్ 24, (

ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆశీర్వచనం అందించడం ప్రస్తుతం టీటీడీలో పెను దుమారం రేపుతోంది. ఈ ఘటనపై టీటీడీ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఒంటిమిట్ట కోదండ



రామాలయానికి చెందిన అర్చకులు ఎ. శ్రావణ్ కుమార్, వీణా మనోజ్ కుమార్, కె. పార్థసారథిలు ఇటీవల పులివెందులకు వెళ్లారు. అక్కడ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. అయితే, టీటీడీ పరిధిలో పనిచేసే అర్చకులు ఎవరైనా సరే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలంటే ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. కానీ, ఈ ముగ్గురు అర్చకులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా వెళ్లడం నిబంధనల ఉల్లంఘనగా అధికారులు భావిస్తున్నారు. కేవలం ఆశీర్వచనం ఇవ్వడమే కాకుండా, ఆలయానికి సంబంధించిన అత్యంత పవిత్రమైన శేష వస్త్రాన్ని, రాములోరి తోమాలను, ముత్యాల తలంబ్రాలను జగన్‌కు అందజేశారు. సాధారణంగా ఇవి ప్రభుత్వం తరఫున అధికారికంగా లేదా అత్యున్నత హోదాలో ఉన్న వ్యక్తులకు ప్రోటోకాల్ ప్రకారం అందజేయాల్సి ఉంటుంది. అర్చకులు తమ స్వంత నిర్ణయంతో వీటిని తీసుకువెళ్లి అందజేయడం టీటీడీ నిబంధనలకు విరుద్ధమని, ఇది అర్చకుల అత్యుత్సాహమేనని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన టీటీడీ ఉప కార్యనిర్వాహణాధికారి ఎ. ప్రశాంతి సంబంధిత అర్చకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. టీటీడీ నిబంధనలను అతిక్రమించి, రాజకీయ నాయకుల నివాసాలకు వెళ్లి ఆశీర్వచనాలు అందించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను వివరణ కోరారు. నోటీసులు అందుకున్న అర్చకులు శ్రావణ్ కుమార్, మనోజ్ కుమార్, పార్థసారథిలు రెండు రోజుల్లోగా తమ వివరణను లిఖితపూర్వకంగా సమర్పించాలని అధికారులు ఆదేశించారు. వారిచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# రూ. 403 కోట్ల పనులెప్పుడు

తిరుపతి, ఏప్రిల్ 24, (

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో రూ. 1,586 కోట్లతో చేపట్టిన స్మార్ట్ సిటీ పనులు అస్తవ్యస్తంగా మారాయి. 2019 ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను పక్కన పెట్టేసింది. ఫలితంగా సుమారు రూ. 403 కోట్ల విలువైన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది.ప్రస్తుతం ఆగిపోయిన పనులు పూర్తి కావడానికి మరో రూ. 246.90 కోట్లు అవసరమని అంచనా. ముఖ్యంగా సిటీ ఆపరేషన్ సెంటర్ (కమాండ్ కంట్రోల్ సెంటర్) భవన నిర్మాణానికి రూ. 274.50 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం రూ. 27.60 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ. 246.90 కోట్లు వస్తేనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంది.తుకివాకంలో నిర్మిస్తున్న 24 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనికోసం రూ. 45.75 కోట్లు కేటాయించగా, రూ. 21.17 కోట్లు ఖర్చయ్యాయి. మిగిలిన నిధులను 'అమృత్ 2.0' పథకం ద్వారా సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. గొల్లవానిగుంట స్టేడియం, బాస్కెట్‌బాల్ ఇండోర్ స్టేడియం పనులు అసంపూర్తిగా ఉండటంతో వాటిని ఇతర ప్రభుత్వ సంస్థలకు అప్పగించే యోచనలో ఉన్నారువినాయక సాగర్ వద్ద దుకాణాలు, నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో పనుల కోసం రూ. 4.91 కోట్లు కేటాయించగా, రూ. 2.38 కోట్లు చెల్లించారు. మిగిలిన నిధులను నగరపాలక సంస్థ సమకూర్చుకోవాల్సి ఉంది.పీపీపీ (ఖఖఖ) పద్ధతిలో తుకివాకంలో 6 మెగావాట్ల సోలార్ ప్లాంట్, రైల్వే స్టేషన్ వద్ద మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులను పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్ పార్కింగ్ ప్రాజెక్టు కోసం రూ. 74.30 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ. 21.64 కోట్లు ఖర్చయ్యాయి. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన సంస్థకు అప్పగించేలా సంప్రదింపులు జరుపుతున్నారు.

====================

# ఉత్తరాంధ్రలో పుంజుకోని ఫ్యాన్

విశాఖపట్టణం, ఏప్రిల్ 24,

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒకప్పుడు దూకుడుగా ఉన్న వైసీపీ ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. కీలక నాయకులు ఉన్నప్పటికీ.. ఎవరికి వారు పార్టీలో స్వతంత్ర నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ఇది .. పార్టీని ముందుకు తీసుకువెళ్లకపోగా.. మరింత వెనక్కి నెడుతోందని తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కన్నబాబును ఉత్తరాంధ్ర ఇంచార్జ్‌గా నియమించిన తర్వాత.. పార్టీలో సహకారం కొరవడింది. దీంతో ఆయనను కేవలం విశాఖకు పరిమితం చేశారు.అయినా కూడా బొత్స సత్యనారాయణ సామాజిక వర్గం పార్టీలో వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. జిల్లాల పరంగా చూసుకుంటే.. టీడీపీ, జనసేనలకు ఉన్న బలం వైసీపీకి కనిపించడం లేదు. విశాఖలో ఎంపీ భరత్ సహా టీడీపీ సీనియర్లు.. పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. కానీ, ఇదేసమయంలో వైసీపీ తరఫున బలమైన వాయిస్ వినిపించే గుడివాడ అమర్నాథ్ వంటి వారికి పార్టీలో సహకారం అంతంత మాత్రమేనన్నది సీనియర్లే చెబుతున్నారు. ఇక, శ్రీకాకుళంలో ధర్మాన సోదరులపైనే వైసీపీ ఆధారపడింది. మాజీ మంత్రిసీదిరి అప్పలరాజును వైసీపీ నాయకులు పక్కన పెట్టేశారు. మరోవైపు.. ఇదే జిల్లాలో జనసేన, టీడీపీ తరఫున కింజరాపు ఫ్యామిలీ సహా.. ఇతర నాయకులు బలంగా పార్టీ లను ముందుకు తీసుకువెళ్తున్నారు. వీరి దెబ్బతో వైసీపీ ఎక్కడా పుంజుకునే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. పోనీ.. పాత నాయకులు అయినా.. బయటకు వస్తున్నారా? అంటే.. కేవలం మీడియా సమావేశాలకే పరిమితం అవుతున్నారు.ఇక, విజయనగరంలో వైసీపీ చీలికలు పేలికలుగా తయారైందన్నది పార్టీలో కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. జిల్లాలో బొత్స ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ద్వారా.. వైసీపీ పెద్ద పొరపాటు చేసిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, ఇదేజిల్లాలో జనసేన భారీగా పుంజుకుంటోంది. దీనికి టీడీపీ సహకారం కూడా తోడైంది. దీంతో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలలోనూ.. వైసీపీ వర్గ పోరుతో ముందుకు సాగలేక.. వెనక్కి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.. జనసేన+టీడీపీ ఉమ్మడిగా జిల్లాలను దున్నేసే పరిస్థితి నెలకొంది.

=======================

# రైతు సమాచారంలో ఆశించిన స్థాయికి చేరని డిజిటల్ సేవలు..!

# సన్నిహిత సమాచారం పైనే అన్నదాత విశ్వాసం..!

పంట ఉత్పాదకత పెరగడంలో, సాగు నిర్ణయాల్లో, స్థిరమైన వ్యవసాయ విధానాల అమలులో వ్యవసాయ సమాచారం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పాడి రైతులు ఇప్పటికీ ఎక్కువగా సాంప్రదాయ సమాచార వనరులపై ఆధారపడుతున్నారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వరి ఎగుమతి ప్రాంతాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి.వాతావరణ మార్పులు, పురుగు నియంత్రణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మార్కెట్ ధరల వంటి కీలక విషయాల్లో రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు వంటి వ్యక్తిగత వనరులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తేలింది. శాస్త్రీయ వ్యవసాయ సమాచార వనరులు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం ఇంకా ఆశించిన స్థాయికి చేరలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

కుటుంబమే ప్రధాన సమాచారం వనరు..

తెలంగాణలో 65 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 68.75 శాతం రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచే వ్యవసాయ సమాచారాన్ని ఎక్కువగా పొందుతున్నట్లు తేలింది. పొరుగువారి నుంచి సమాచారం పొందే శాతం కూడా గణనీయంగా ఉంది. అయితే ఈ విధానం వల్ల ఆధునిక "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (ఉంఖ)" గురించి అవగాహన తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, సమాచారం తరతరాలుగా పరిమిత వర్గాల్లోనే కొనసాగుతుందని అధ్యయనం పేర్కొంది.ప్రభుత్వ వ్యవసాయ అధికారులపై అధిక విశ్వాసం..సాంప్రదాయేతర వర్గాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల విశ్వాసం అత్యధికంగా ఉన్నట్లు తేలింది. తెలంగాణలో 71.25 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 73.75 శాతం రైతులు వీరి ద్వారా సమాచారం పొందుతున్నారు.తెలంగాణలో రైతు వేదికల ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (ఖీఃబబ) ద్వారా వ్యవసాయ సలహాలు చేరుతున్నప్పటికీ, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పూర్తి స్థాయి చేరిక లేనట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు, ఎఅంఖీ సంస్థలతో రైతుల ప్రత్యక్ష సంబంధం తక్కువగా ఉండడం కూడా ఒక ప్రధాన లోటుగా పరిశోధన పేర్కొంది. ఎన్జీవోల పాత్ర కూడా పరిమితంగానే ఉంది.

మీడియా వినియోగంలో మార్పులు.. మొబైల్ పై ఆసక్తి... మాస్ మీడియా వర్గంలో కిసాన్ మేళాలు, వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు ప్రధాన సమాచార వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం ఉండటంతో రైతులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.న్యూస్‌పేపర్లు మోస్తరు స్థాయిలో వినియోగంలో ఉండగా, మొబైల్/ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ డిజిటల్ వినియోగం కొంత ఎక్కువగా కనిపిస్తోంది.టీవీ వినియోగం పరిమితంగా ఉండగా, రేడియో పూర్తిగా దాదాపు వినియోగంలో లేకపోవడం గమనార్హం. ఇది సమాచార వినియోగంలో డిజిటల్ మరియు విజువల్ మీడియా వైపు రైతులు మళ్లుతున్న సంకేతంగా కనబడుతోంది.మొత్తం వినియోగ ధోరణి..అధ్యయనంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువ మంది (సుమారు 61.88 శాతం) మధ్యస్థ స్థాయి సమాచార వినియోగాన్ని చూపినట్లు తేలింది. తక్కువ స్థాయి వినియోగం 21.87 శాతం ఉండగా, అధిక స్థాయి వినియోగం 16.25 శాతంగా నమోదైంది.నిపుణుల అభిప్రాయం.. వ్యవసాయ సమాచార వ్యవస్థలో ప్రభుత్వ విస్తరణ సేవలు కీలకంగా ఉన్నప్పటికీ, పరిశోధనా సంస్థలు?రైతుల మధ్య దూరం తగ్గించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు, మొబైల్ యాప్స్ మరింత విస్తృతంగా చేరితే మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతుల స్వీకరణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పరిశోధన ప్రకారం, రైతులు ఇప్పటికీ కుటుంబం, స్నేహితులు వంటి సాంప్రదాయ వనరులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వ వ్యవసాయ సేవలు మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వైపు నెమ్మదిగా మార్పు కనిపిస్తోంది. అయితే ఈ మార్పు వేగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది

# ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం

హైదరాబాద్ ఏప్రిల్ 24, (న్యూస్ పల్స్)



సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీ కే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రా ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది. అది కాస్త టీవీకే పార్టీకి ప్లస్ అయిందని రవి భావిస్తున్నాడు.. అతడు చేసిన ఈ ట్వీట్.. సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. మొన్నటిదాకా పైరసీ వ్యాపారం చేశావు.. ఇప్పుడేమో పొలిటికల్ గా మారిపోయావా.. ఏమైనాప్పటికీ నీ విశ్లేషణ వాస్తవ పరిస్థితికి దగ్గరగా ఉందని కొంతమంది అంటుంటే.. మిగతావారేమో ప్రశాంత్ కిషోర్ లాగా నువ్వు కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి.. కోట్లు సంపాదించుకో అంటూ మరి కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

భారత శక్తి
25-4-2026, శనివారం

# అనవసర వివాదాలు...

హైదరాబాద్, ఏప్రిల్ 24,

మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణరావు.. జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందుకు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీమ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవి అందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు తరచూ చంద్రబాబును.. రేవంత్ రెడ్డిని ఇష్టానుసారంగా తిట్టే కేసీఆర్.. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకారులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

# సూర్యాపేట మున్సిపాలిటీ రెవెన్యూ సెక్షన్‌లో ఏం జరుగుతోంది?

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కౌన్సిలర్- గండూరి రమేష్ చేసిన మెసేజ్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 24:

సూర్యాపేట మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్ గండూరి రమేష్ శుక్రవారం సోషల్ మీడియా గ్రూపులలో పోస్ట్ చేసిన మెసేజ్లు వైరల్ గా మారాయి. సూర్యాపేట మున్సిపాలిటీ రెవెన్యూ సెక్షన్లో ఏం జరుగుతుంది అని ఆయన చేసిన వైరల్ పోస్ట్ మెసేజ్ లకు పలువురు ప్రజాప్రతినిధులు పార్టీల నాయకులు ప్రభుత్వ అధికారులు మీడియా ప్రతినిధులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు సైతం అవురా అని ఆలోచనలో పడ్డారు.సోషల్ మీడియాలో గండూరి రమేష్ చేసిన వైరల్ మెసేజ్ ఈ క్రింది విధంగా ఉంది.



సూర్యాపేట మున్సిపాలిటీ అంటే ప్రజల సొమ్ముకు రక్షక నిలయమా లేక అవినీతికి అడ్డానా? రెవెన్యూ సెక్షన్‌లో వెలుగు చూస్తున్న వరుస కుంభకోణాలు చూస్తుంటే, అక్కడ చట్టం చుట్టంలా మారిందనిపిస్తోంది. వ్యవస్థను మేసేస్తున్న తిమింగలాలెవరు? అధికారుల మౌనం వెనుక ఉన్న రహస్యం ఏంటి?

పోష్ బిల్డింగ్.. ఆర్డినరీ ట్యాక్స్: ఇది ఎవరి మేలు కోసం?

కొత్తగా నిర్మించిన 'పోష్' కేటగిరీ భవనాలను, రికార్డుల్లో 'ఆర్డినరీ'గా మార్చడం వెనుక ఉన్న మాయాజాలం ఏంటి? ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, నిబంధనలను తుంగలో తొక్కి ఈ మార్పులు చేయాలని ఆదేశించిన ఆ 'అదృశ్య శక్తి' ఎవరు? ఈ ట్యాక్స్ తారుమారు వల్ల మున్సిపాలిటీ కోల్పోయిన ఆదాయం ఎంత? ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లింది? బిల్డింగ్ యజమానులతో కుదిరిన 'డీల్' విలువ ఎంత?

ట్యాక్స్ వసూళ్లలో 'తిరోగమనం' -- ఇది వైఫల్యమా? ప్లానా?

గత ఏడాదితో పోలిస్తే ట్యాక్స్ వసూళ్లు పడిపోవడం వెనుక అసలు కథ ఏంటి? 5% రిబేట్ స్కీమ్ ఉన్నా టార్గెట్ రీచ్ కాలేదంటే అది చేతగానితనమా లేక కావాలని చేస్తున్న కుట్రనా?

ప్రజలు ట్యాక్స్ కట్టడానికి సిద్ధంగా ఉన్నా, వసూళ్లలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? వసూలైన సొమ్ము లెక్కల్లోకి రాకుండా పక్కదారి పడుతోందా?

చనిపోయిన వారికి జీతాలు.. రిటైర్డ్ వారికి రివార్డులు!లి గత రికార్డులు తిరగేస్తే మతిపోతోంది. 2016-17లో చనిపోయిన ఉద్యోగికి 11 నెలలు, రిటైర్డ్ ఉద్యోగికి 7 నెలల పాటు జీతాలు ఎలా వెళ్లాయి?

ఆత్మలకు జీతాలు ఇచ్చే వింత సంప్రదాయం సూర్యాపేటలోనే ఉందా? ఆ సమయంలో నిద్రపోతున్న అకౌంట్స్ అండ్ రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఏ హోదాలో ఉన్నారు? వారిపై చర్యలు ఎందుకు శూన్యం?

రోడ్డుకే నంబర్ ఇచ్చిన 'ఘనులు'!

100 ఫీట్ల ప్రభుత్వ రోడ్డుకి ఏకంగా అసెస్మెంట్ నంబర్ కేటాయించడం,అంటే చేతివాటంతో ఇది బరితెగింపు కాదా? రోడ్డును కూడా మింగేయాలని చూస్తున్న భూబకాసురులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారా? కలెక్టర్ షోకాజ్ నోటీసు ఇచ్చినా పరిస్థితి మారలేదంటే, అసలు వ్యవస్థపై ఎవరికైనా భయం, బాధ్యత ఉందా?

అదే వ్యక్తి.. అదే సీటు.. ఎందుకీ ప్రేమ?

ఇన్ని ఆరోపణలు, ఇన్ని వైఫల్యాలు, సాక్షాత్తూ కలెక్టర్ నోటీసులు ఉన్నా.. అదే వ్యక్తి ఆర్వో గా కొనసాగడం వెనుక ఉన్న బలమైన రాజకీయ లేదా అధికారుల అండ ఎవరిది? విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సింది పోయి, రక్షణ కల్పిస్తున్నారా? ఇది 'కవరప్' ఆపరేషన్ కాదా? ఈ మొత్తం వ్యవహారంపై సీఐడీ లేదా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించడానికి ప్రభుత్వం ఎందుకు వెనకాడుతోంది?

ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన పొరపాటు కాదు.. ఇదొక వ్యవస్థీకృత నేరం (సిస్టమిక్ క్రైమ్ ). డేటా మార్పుల దగ్గరి నుండి, డెడ్ పర్సన్స్ శాలరీస్ వరకు అంతా ఒకే పద్ధతిలో సాగుతోంది. ఇప్పటికైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, సూర్యాపేట మున్సిపాలిటీ అంటే "అవినీతికి కేరాఫ్ అడ్రస్" అని ప్రజలు ఫిక్స్ అయిపోవడం ఖాయం!

ప్రజలు అడుగుతున్నారు: సమాధానం ఎవరి దగ్గర ఉంది?

# ఏడాది తర్వాత రన్యా రావుకు బెయిల్

బెంగళూరు, ఏప్రిల్ 24

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటికి.. ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. ఏడాది నుంచి ఆమె బెయిల్ కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం రన్యా రావు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు.బంగారం అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏడాది నుంచి జైల్లో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు ఊరట లభించింది. కర్ణాటక కోర్టు ఆమెకు బుధవారం నాడు బెయిల్‌ను మంజూరు చేసింది. మొత్తం రూ.102 కోట్ల విలువైన బంగారాన్ని దుబాయ్ నుంచి దేశానికి అక్రమంగా తరలించారనేది ప్రధాన ఆరోపణ. ఆర్థిక నేరాల విచారణ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రన్యా రావు జైలు నుంచి త్వరలోనే విడుదల కానున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.8 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గతేడాది మార్చి 3న కెంపెగౌడ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు రన్యా రావు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ భారీ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కర్ణాటక సీనియర్ పోలీస్ అధికారి కే. రామచంద్రరావుకు రన్యా రావు సవతి కూతురు.

# భైంసా వాసవి హై స్కూల్‌లో నర్సరీ విద్యార్థులకు వీడ్కోలు.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(భారత శక్తి ) భైంసా పట్టణంలోని వాసవి హై స్కూల్‌లో నర్సరీ తరగతి ముగిసిన సందర్భంగా శుక్రవారం హృదయపూర్వకంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల విద్యా ప్రయాణంలో తొలి దశ పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయురాలు వారికి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయురాలు విద్యార్థిని అలేహ మైజా కు బహుమతులు అందజేసి, వారి ప్రతిభను ప్రశంసించారు. ఇక నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లలు సంతోషంగా గడపాలని, తదుపరి తరగతుల్లో మరింత కృషి చేసి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు.అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యాభివృద్ధికి సహకరించాలని పాఠశాల యాజమాన్యం కోరింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని




విద్యార్థులు, ఉపాధ్యాయురాలు,ఆయమ్మ తల్లిదండ్రులు పాల్గొని ఆనందంగా ఉందని విద్యార్థిని తల్లిదండ్రులు అంటున్నారు.

# భైంసాలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.

-ప్రతీ ఫిర్యాదు పై తక్షణ స్పందన

-బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం




నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(భారత శక్తి)జిల్లాఎస్పీ డా.జి.జానకి షర్మిల, భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.

ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.


# గోదావరి తీరంలో నల్లమట్టి అక్రమ జోరుగా తవ్వకాలు

**- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం.**

**అందిన గాడికి దోచుకో..!**

**-అసలు రెవెన్యూ మైనింగ్ అధికారులు ఉన్నట్టా లేనట్టా?**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(భారత శక్తి) బాసర పరిధిలో గోదావరి నది తీర ప్రాంతాల్లో నల్లమట్టి అక్రమ తవ్వకాలపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లా సరిహద్దుకు ఆనుకుని ఉన్న పంచగుడి గ్రామ శివారు ప్రాంతంలో ఈ అక్రమ కార్యకలాపాలు బహిరంగంగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు జేసీబీలు ఉపయోగించి నల్లమట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా భారీగా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.గ్రామ ప్రజల వివరాల ప్రకారం, కొందరు ప్రభావశీల నాయకుల ఆధ్వర్యంలో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని, ఇది కేవలం చిన్న స్థాయి అక్రమం కాదని---లక్షల్లో, కోట్లలో అక్రమ ఆదాయం పొందుతున్నారనే



అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మల్ జిల్లా కలెక్టర్, గతంలో ఫిర్యాదు చేయగా లోకేశ్వరం మండల ఎమ్మార్వో ఎలాంటి చర్యలు తీసుకోలేదు అని అర్థమవుతుంది. మండల రెవెన్యూ అధికారులు, మైనింగ్ విభాగం అధికారులు ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.అదేవిధంగా, లోకేశ్వరం మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కళ్లముందే ఈ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా ఉత్పన్నమవుతున్నాయి. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, సరైన స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఈ అక్రమ తవ్వకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయ నష్టం జరుగుతోందని నిపుణులు సూచిస్తున్నారు. నల్లమట్టి వంటి సహజ వనరులు నియంత్రణ లేకుండా తరలిపోవడం వల్ల ప్రభుత్వానికి ంవాల్సిన రాయల్టీలు, పన్నులు కోల్పోతున్నాయి.ఇక పర్యావరణ పరంగా కూడా ఈ తవ్వకాలు తీవ్ర నష్టాలను కలిగిస్తున్నాయి:గోదావరి నది తీర ప్రాంతాల భూసంరచన దెబ్బతింటోంది, దీని వల్ల వరదల సమయంలో మట్టి క్షీణత పెరుగుతుంది.సాగుభూముల సారవంతమైన పై మట్టి తొలగిపోవడంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది.భూగర్భ జలాల స్థాయిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.జీవ వైవిధ్యం నష్టపోయి, స్థానిక జీవవ్యవస్థ అసంతులనం చెందుతుంది.అక్రమ రవాణా వల్ల రహదారులు దెబ్బతినడం, ప్రమాదాల ప్రమాదం పెరగడం వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, అక్రమ నల్లమట్టి తవ్వకాలను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, సహజ వనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# దుర్గం కొత్తబాది తండాలో వివాహ విందులో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 24: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలోని దుర్గం కొత్తబాది తండాలో కామారెడ్డి 2వ వార్డ్ కౌన్సిలర్ మోతిలాల్ తమ్ముడి వివాహ విందులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్త దంపతులను ఆశీర్వదించిన షబ్బీర్ అలీ వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వివాహ వేడుకలో పాల్గొన్న అతిథులతో కలిసిమెలిసి సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, డీసీసీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు నౌసిలాల్, ఇప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు షేరు, అంజాద్, సీనియర్



నాయకులు భాస్కర్ గౌడ్ తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, గృహనిర్మాణ పురోగతి, రెవెన్యూ సమస్యలపై హైదరాబాద్ టీజీఎస్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 24: పూర్వపు నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, గృహనిర్మాణ పురోగతి, రెవెన్యూ సమస్యలపై రెవెన్యూ, సమాచార, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల సమస్యలపై సమీక్షా సమావేశం 27.04.2026 ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని టీజీఎస్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులతో మినీ సమావేశం మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించి, ఇందిరమ్మ ఇళ్ళు, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పురోగతిపై ఆరా తీసి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, రెవెన్యూ, హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ.

రేగొండ, ఏప్రిల్ 24 (భారత శక్తి):అలీఫ్ సంస్థ సెర్ప్ (రాజు-రా) మరియు ప్రభుత్వ సహకారంతో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నామని మీవీజు కౌన్సిలర్ సుమలత తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన టైలరింగ్, బ్యూటిషన్ 15 రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ప్రతి మహిళ తన ఇంటిలో పిల్లలకు అవసరమైన బట్టలు కుట్టుకోవడానికి, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆలీప్ సంస్థ సెర్ప్ జయభారత్,గ్రామ సర్పంచ్ వారణాసి మౌనిక అజయ్,డీపీఎం ,ఏపీఎం , లు తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మబలిదానాలు వద్దు...హక్కుల సాధనకు కలిసి పోరాడుదాం: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 24 :ఆర్టీసీ కార్మికులు హక్కుల సాధనకోసం సంఘటితంగా కలిసి పోరాడుదాం తప్ప కార్మికులు ఎవ్వరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం చేసుకోవటం తీవ్రంగా కలిచివేసిందని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.ఆర్టీసీ కార్మికులు ఎవ్వరూఆత్మబలిదానాలకు ఒడిగట్టవద్దని విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీలో ఇలాంటి పరిస్థితి వచ్చింది. శంకర్ గౌడ్ ఆత్మబలిదానంకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత.అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ మాట తప్పారు. పీఆర్సీ లతో పాటు కార్మికుల డిమాండ్లు ఏవీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదు.మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి ఇంకా ఎంతమంది ప్రాణాలు బలి తీసుకుంటావని అన్నారు.తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుదాం అని 'మీ వెంటే మేమున్నాం' అని భరోసా ఇచ్చారు.ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమస్యల నివారణకు తక్షణ చర్యలు చేపట్టి వారిలో విశ్వాసం కల్పించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికులు అధైర్యానికి గురికాకుండా, కలిసికట్టుగా హక్కుల సాధనకు పోరాడుదాం అని అన్నారు.దయచేసి ఆర్టీసీ కార్మికులు ఆత్మబలిదానాలకు నిర్ణయాలు తీసుకోవద్దని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు.



# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 24:



వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారికంగా ప్రకటించడంతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీలో కృతజ్ఞత సభ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ వనిత మాట్లాడుతూ.. వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి అధికారకంగా ప్రకటించడం హర్షనీయమని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడానికి స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ అత్యధిక నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సభ జరుగుతుందని చెప్పారు. వాసవి జయంతిని అధికారికంగా ప్రకటించేందుకు కృషిచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ కాల్వ సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెజగం శ్రీనివాస్, కౌన్సిలర్ తోపాజి వీణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మిర్యాల పాండురంగం, ప్రధాన కార్యదర్శి అక్షంతల మదన్మోహన్, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడం రాధా కిషన్, జూలకంటి బుచ్చిలింగం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి ప్రకాష్, వాసవి మహాసంస్థాన్ ప్రధాన కార్యదర్శి ఇల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి నామ భాస్కర్, యువజన విభాగం అధ్యక్షుడు తోపాజి హరీష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తోపాజీ తేజవతి, పట్టణ అధ్యక్షురాలు అక్షంతల కృష్ణవేణి పాల్గొన్నారు.

# నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 24: శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

పాల్గొని మాట్లాడుతూ, అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓ ననుసరించి నియమ నిబంధనలు తప్పకుండ పాటించాలని అన్నారు.మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు.

మీడియా రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రిడిటేషన్ ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్,



డిపిఆర్ఓ తిరుమల, కమిటీ సభ్యులుగా వి. రజనీకాంత్, మంత్రి ఆంజనేయులు, వుక్కల్కర్ రాజేందర్‌నాథ్, వేణుగోపాల చారి, సయ్యద్ కౌసర్ అలీ, వి. శశిధర్, షేక్ మొయినుద్దీన్, బొక్కల వేణు, గంట చంద్ర శేఖర్, మహమ్మద్ ఆబిద్ , తదితరులు పాల్గొన్నారు.

# దర్గాగా దేవాలయ జాగా కబ్జా..

## -పట్టించుకోని దేవాలయ, మున్సిపల్ అధికారులు
## - బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిరసన
## - కబ్జాదారులపై క్రిమినల్ చర్యలకు బిజెపి డిమాండ్





భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 24: యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠ ద్వారం పక్కన గల దేవస్థానానికి గల స్థలాన్ని కొందరు అక్రమంగా షెడ్డు నిర్మించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి యాదగిరిగుట్ట పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ గుట్ట మీదనేమో గుడిని మింగేటోడు ఒకడు, గుట్ట కిందనేమో దేవస్థాన భూములను కబ్జా చేసి భూములను మింగేటోడు ఒకడు తయరయ్యారని మండిపడ్డారు. గతంలో కౌన్సిలర్ భర్తగా ఉన్నపుడు అవే భూ కబ్జాలు, ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ భర్తగా తిరిగి అవే కబ్జాలు చేస్తున్నా ఈ అధికారులకు కనిపడట్లేదా అని విమర్శించారు. దేవస్థానం భూమిలో చలివేంద్రం పేరు చెప్పి ఇంత దర్జాగా భారీ రేకుల షెడ్డు ఎలా వేశారని, మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండా, మున్సిపల్ కమిషనర్ కు, దేవస్థాన ఈవోకు కూడా తెలియకుండా ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఒక సామాన్యుడు ఇలాంటి పని చేస్తే కేసు నమోదు చేసి ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టేవారని కానీ పోలీసులు ఈ వ్యవహారంలో ఎందుకు చూసీ చూడనట్లు ఉంటున్నారో వారికే తెలియాలన్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ ను, దేవస్థాన ఈవోను సంప్రదిస్తే మాకు తెలియదని అంటున్నారని, మేము సమాచారం ఇచ్చేవరకు గానీ దేవస్థాన అధికారులకు తెలియకుండా ఉంటే రేపు ఇంకా ఏదైనా జరిగినా ఇదే మొద్దు నిద్రలో ఉంటారా అని విమర్శించారు. మేము ఈ రోజు నిరసన చేయగానే ఇప్పుడు ఏదో హడావిడిగా షెడ్డు నిర్మాణం తొలగించినారని కానీ దేవస్థాన భూమిలో అక్రమంగా షెడ్డు నిర్మించిన మున్సిపల్ చైర్మన్ భర్తతో పాటు దీనితో సంబంధం ఉన్న అందరిపైన క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవస్థానం అనుమతి లేకుండా షెడ్ ఎలా వేశారు.. మున్సిపల్ కమిషనర్ కి తెలియకుండా సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎలా దగ్గరుండి షెడ్ వేయించాడో ప్రజలకు తెలియాలని, మున్సిపల్ కౌన్సిల్ లో ఎలాంటి తీర్మానం లేకుండా సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎలా వేయిస్తాడని ప్రశ్నించారు. చలివేంద్రం కోసం మున్సిపాలిటీయే షెడ్డు వేయించినపుడు చైర్మన్ వాణీ భరత్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఏం పని, వాళ్ళ ట్రాక్టర్ డ్రైవర్ కు ఏం పనో తెలపాలన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోని పక్షంలో భారీ నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్,పట్టణ మాజీ అధ్యక్షులు భువనగిరి శ్యామ్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆకుల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మందోజు నరేష్, సీనియర్ నాయకులు రంగ సత్యం, నల్ల వెంకటరెడ్డి, బోడ సురేష్, లెంకలపల్లి శ్రీను, పట్టణ కార్యదర్శులు ఆవుల సత్యం, ఆలేటి కర్ణ, దొమ్మాట ప్రభాకర్, శివరాత్రి శ్రీశైలం, బోడ బుచ్చిబాబు, గాదె వంశీ, కర్రె లక్ష్మయ్య, విజయ్, రమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగొచ్చు

## -త్వరలో 15 ఎకరాలలో మామిడి మార్కెట్ ను ఏర్పాటు చేసుకోబోతున్నాం
## -ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన సదస్సులో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 24

రైతులు తక్కువ నీటి వసతితో అధిక దిగుబడిచే పంటలను ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్టార్ బాంకెట్ హాల్లో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవడం ఎంతో ఉత్తమం అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత, నేటి లభ్యత కారణంగా రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయాలన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రత్యేక సబ్సిడీలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించే రైతుల కోసం ఎన్ ఎం ఈ ఓ - ఓ పి పథకం కింద మొక్కలు,ఎరువులు, అంతర పంట సాగు బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో 50 వేల 918 రూపాయలు రాయితీ కింద ఇస్తుందన్నారు. మొక్కల కోసం రైతు తన వాటా కింద ఒప్పో మొక్కకు 20 రూపాయల చొప్పున చెల్లించవలసి ఉంటుందని బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మార్గదర్శకాలను అనుసరించి రైతు తన వాటా చెల్లించాలని అన్నారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ పంప్ కంపెనీలు నర్సరీ పెంచి రైతులకు మొక్కలు సరఫరా చేసి రైతులకు తగు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు జిల్లా పరిధిలో ఆయిల్ ఫామ్ మిల్లును ఏర్పాటు చేసి ప్రతినెల ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుల దగ్గర నుంచి ఆయిల్ ఫామ్ గెలలు కొనుగోలు చేసి 14 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు.తుంగతుర్తి లోని స్వంత వ్యవసాయ క్షేత్రంలో 25 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు.బట్టి రైతులు ప్రస్తుత పరిస్థితుల దృశ్య ఆయిల్ఫామ్ సాగును ఎంచుకొని ఆర్థికంగా బలపడాలని కోరారు.పంట మార్కెట్ చేసుకోడానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసుకుందాం.త్వరలో 15 ఎకరాలలో మామిడి మార్కెట్ ను ఏర్పాటు చేసుకోబోతున్నాం.కోటపహాడ్ గ్రామానికి వెళ్ళినప్పుడు రైతుల కోరిక మేరకు మార్క్ ఫెడ్ అధికారులతో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.2012 నుండి ఈ రోజు వరకు హైదరాబాద్ హయత్ నగర్ లో మా అమ్మ పేరు మీద డైరీ ఫామ్ నడుపుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాసం లింగా రెడ్డి, వైస్ చైర్మన్ పంతంగి మల్సూర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ధారవత్ వీరన్న నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఆయిల్ ఫెడ్ ఇంచార్జి అలీం, కెవికే సీనియర్ హెడ్ డాక్టర్ నరేష్, కెవికే సీనియర్ సైటిష్ట్ నరేష్, ఇఫ్కో మేనేజర్ వెంకటేష్, జేకే పేపర్స్ మేనేజర్ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర పండుగా వాసవి మాత జయంతి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆర్యవైశ్య కులస్తులు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 ( భారత శక్తి ) : వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినందుకు సీఎం చిత్రపటానికి శుక్రవారం రోజున మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య కులస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వాసవి మాత జయంతినీ రాష్ట్ర పండుగా అధికారికంగా ప్రకటించినందుకు ధన్యవాదములు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమినాడు వేడుకలు జరపాలని అలాగే ఈనెల 26న వాసవి మాత జయంతి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిపురం రాజేష్, మాదంశెట్టి సత్యనారాయణ,ముక్త శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, వుత్తూరు రమేష్ ,చిలువేరు శ్రీనివాస్ ,దొంతుల ముకేష్ ,కట్కం హరీష్,వెంకటేశ్వర్లు, తాటిపల్లి సాయి వర్ధన్ ,పడకంటి శ్రీనివాస్ ,ముక్త విశ్వాస్ ,ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు చేరువగా న్యాయ సేవలు

కడప, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 24:



మొబైల్ న్యాయసేవల వాహనాన్ని చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంత ప్రజలకు న్యాయ సహాయం అందించేందుకు ఈ వాహనం ఉపయోగపడనుంది. అణగారిన వర్గాల గడప వరకు న్యాయ సేవలు తీసుకెళ్లాలన్నారు. ఉచిత న్యాయసహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, చట్టపరమైన మార్గదర్శనం వంటి సేవలు ఇందులో అందించనున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు న్యాయం మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించే సాధనంగా ఈ వాహనం ఉంటుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో కడప హెడ్ క్వాటర్ లో ఉండే అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులు, జూనియర్ న్యాయమూర్తులు, డి.ఎల్.యస్.ఎ సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల ఏప్రిల్ 24( భారత శక్తి ప్రతినిధి ):

శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరం లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటే షన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓ ననుసరించి నియమ నిబంధనలు పాటించాలని అన్నారు.

మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.

అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు.

ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతకుముందు కమిటీ సభ్యులు చీటీ శ్రీనివాసరావు మరియు పిఎస్ రంగారావు అక్రిడియేషన్ ప్రక్రియ గురించి తమ అనుభవాలను పంచుకొని, ఈ ప్రక్రియ సజావుగా మరియు పారదర్శకంగా సాగే విధంగా పలు సూచనలు చేశారు.

అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ ను శాలువా కప్పి పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశం లో డి పి ఆర్ ఓ. నరేష్, డిమాక్ కమిటీ సభ్యులు చీటీ శ్రీనివాసరావు, గంగుల రామ్ గోపాల్, ద్యావర సంజీవరాజు, పి.ఎస్. రంగారావు, అబ్దుల్ ముజాహిద్ ఆదిల్, కర్నే సంతోష్, బి.సదాశివకుమార్ దొమ్మటి అంజు గౌడ్, వి. ప్రవీణ్ కుమార్,ఎస్ వేణుగోపాల్ కల్పన,విష్ణు మరియు డిపిఆర్ఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఎంచుకున్న రంగంలో ఏకాగ్రతతో నైపుణ్యత సాధించాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 ( భారత శక్తి ) : నిరుద్యోగ యువత తాను ఎంచుకున్న రంగంలో ఏకాగ్రతతో



నైపుణ్యత సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ వారంలో భాగంగా షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ యువతకు ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పై అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎ టి సి ప్రిన్సిపాళ్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగాలలో ఏకాగ్రతతో నైపుణ్యత సాధించి జీవితంలో స్థిరపడాలని తెలిపారు.వృత్తి విద్య కోర్సులలో ఆధునిక సాంకేతికతను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తుందని,ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాము ఎంచుకున్న కోర్సులను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగరంగంలో రాణించాలంటే నైపుణ్యత తప్పనిసరి అని, మనం నేర్చుకునే ప్రతి అంశం మనం చేస్తున్న పనిలో ఉపయోగపడుతుందని తెలిపారు.ఎంచుకున్న సబ్జెక్టులో పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. జర్మన్ దేశంలో ఎలక్ట్రీషియన్, డ్రైవర్, నర్సింగ్ రంగాలకు అవసరం ఉందని ఉందని, నైపుణ్యత గల వారిని ఎంపిక చేసి జర్మన్ భాషను నేర్పించి ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో వస్తున్న అవకాశాలకు నైపుణ్యత, అనుభవం తప్పనిసరిగా ఉండాలని, కోర్సు అనంతరం అప్రెంటిస్ షిప్ ద్వారా మరింత నైపుణ్యత నేర్చుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించి అవకాశం ఉన్న చోట ఉద్యోగం కల్పించడం జరుగుతుందని,యువత తాము ఎంచుకున్న కోర్సును ఏకాగ్రతతో నేర్చుకుని, నైపుణ్యత సాధించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ జానకి షర్మిలను కలిసిన ఖానాపూర్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(భారత శక్తి):

ఖానాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలను నిర్మల్‌లోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిలకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్పీ తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. ప్రజల భద్రత కోసం ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. పోలీస్ శాఖతో సమన్వయం పెంచుకుని ఖానాపూర్ ప్రాంతంలో మరింత మెరుగైన శాంతి భద్రతలను కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# బీసీ బిడ్డ కుటుంబానికి ఆర్థికసాయం: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కడప, భారత శక్తి, ఏప్రిల్ 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోయిన జిల్లాలోని తొండూరు బీసీ హాస్టల్ విద్యార్థి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిడ్డ చనిపోతే కన్నతల్లి పడే వేదన వర్ణనాతీతమని, ఆ శోకం నుంచి కోలుకోవడం అసాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నామనే భరోసా కల్పించడానికే ఈ చిన్నపాటి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడన్నారు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో గురు ప్రణీత్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకర మన్నారు. పసి ప్రాయంలోనే విద్యార్థి విగతజీవిగా మారడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగానే, బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేస్తామని ఇన్చార్జి మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# రైతుకు నమ్మకమైన విత్తనమే అందించడమే లక్ష్యం:

## తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 ( భారత శక్తి ) :

రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల వ్యవసాయ అధికారులు సురేఖ, విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితులలో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా ఈ 2 జిల్లాల్లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉందని, ప్రతి సంవత్సరం నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి సాగు మాత్రమే కాకుండా, రైతులు లాభదాయకమైన వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉ



త్పత్తి చేపడుతుందని, కఠినమైన ప్రమాణ పరీక్షల తర్వాత వాటిని ధృవీకరించి రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలలో విత్తనాల కొరత లేదని, సన్న రకాలు బి పి టి 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 అందుబాటులో ఉన్నాయని, దొడ్డు రకాలు కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 కూడా రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి విత్తన డీలర్ విక్రయించాలని, పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందిస్తామని తెలిపారు. ఈ వానకాలంలో 2 జిల్లాలలో సుమారు 2 లక్షల ఎకరాలలో వరి సాగు అవుతుందని, ఇందుకు 50 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని, కనీసం 20 వేల క్వింటాళ్లను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. త్వరలో రాబోయే నూతన విత్తన చట్టం రైతుల హక్కులతో పాటు డీలర్ల ప్రయోజనాలను కాపాడుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా, పంట మార్పిడి చేపట్టేలా వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కంది, మినుము పంటలపై అవగాహన కల్పించాలని డీలర్లు కోరగా, విత్తన సరఫరాలో తాము భాగస్వాములం అవుతామని మహిళా సంఘాలు ముందుకు రావడం శుభ పరిణామమని తెలిపారు. పంట సాగులు శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు దిగుబడి చేయవచ్చని తెలిపారు. సాధారణ పంటలే కాకుండా ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్ల సాగుపై రైతులు దృష్టి సారించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. పంట సాగులో వివిధ రకాలైన పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, పంట సాగులో అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ (టెక్నికల్), సహకార అధికారులు, ఏడీఏలు, ఎంఏఓలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది

మెదక్ జిల్లా, ఏప్రిల్ 24 (భారత శక్తి న్యూస్):



నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులకి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలి అన్నారు. సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యంను నిలువు దోపిడి చేశారని అన్నారు.

రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తాం.కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. చేస్తోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్,గౌరీశంకర్,పంచాయతీ కార్యదర్శి రమేష్,మహేశ్వరి,నర్సింలు, ఉప్ప సర్పంచ్, వార్డు సభ్యులు, ఐకేపీ సభ్యులు, నాయకులు,రైతులు, తదితరులు పాల్గొనారు.

# వాస్తవాలను ప్రజలకు తెలిసేలా ప్రచురించాలి

## జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 ( భారత శక్తి ) :



మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026-28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి.రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# రాయిలాపూర్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు

## -చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించుటకు గ్రాడ్యుయేషన్ డే
## -హేమ భార్గవి... జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి మెదక్

మెదక్ జిల్లా, ఏప్రిల్ 24( భారత శక్తి న్యూస్):



కౌడిపల్లి మండలం పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు అంగన్వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల తో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలతో వాళు నేర్చుకున్న కృత్యాలను ప్రదర్శించడం జరిగిందని అన్నారు. పిల్లలకు గ్రాండ్యుయేషన్ డే సందర్భంగా అసెస్మెంట్ కార్డు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ తమ అంగన్వాడి కేంద్రాలలో చేర్పించి పౌష్టిక ఆహారం తో పాటు అక్షరాలను బోధించి చిన్ననాటి నుండి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దరం కోసం అంగన్వాడి సెంటర్లు దోహదపడతాయి అన్నారు. అంగన్వాడీలో చదువుకొని మంచి పౌష్టిక ఆహారాన్ని అందుకొని టీచర్ చెప్పినటువంటి పాఠాలను ఆటల పాటలతో శ్రద్ధగా విని సంతోషంగా అంగన్వాడి స్కూల్లో చదువుకున్నటువంటి విద్యార్థిని విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి చిన్నారులను ప్రోత్సహిస్తూ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిని ఇవ్వడం కోసం మెదక్ జిల్లా వ్యాప్తంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ ద్వారా కార్యక్రమాన్ని వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ తో పాటు సూపర్వైజర్ సుజాత. గ్రామ సర్పంచ్ సప్నా శేఖులు, ఉప సర్పంచ్ సంతోష్ గ్రామ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి సలీం,అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి,కవిత,గర్భిణీ స్త్రీలు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


# జగిత్యాల జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ నియామకం

## -కమిటీ మెంబర్ గా నియమితులైన కర్నె సంతోష్ కు అభినందనల వెల్లువ



జగిత్యాల, ఏప్రిల్ 24( భారత శక్తి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ గడువు ఈనెల 30 తేదీన ముగుస్తున్నందున జగిత్యాల జిల్లా మీడియా అక్రిడీటేషన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో మధ్య తరహా పత్రికల నుండి ప్రతినిధిగా నియమితులైన క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో ప్రతినిధి కర్నె సంతోష్ కు ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధుమహదేవ్, కార్యదర్శి కిషన్, జిల్లా ఈసీ మెంబర్ పవిత్ర, మరియు సీనియర్ జర్నలిస్టులు సురేందర్ కుమార్, రామ కిష్టయ్య అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధు మహదేవ్ మాట్లాడుతూ ధర్మపురి ప్రెస్ క్లబ్ సభ్యుడు మరియు కోశాధికారి అయిన కర్నె సంతోష్ ను మీడియా అక్రిడిటేషన్ మెంబర్ నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న మధ్య తరహా పత్రికలకు న్యాయం చేస్తాడని ఆశిస్తున్నానని తెలియజేశాడు. ఈ నియామకానికి సహకరించిన మీడియా అకాడమీ ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డికి, టి యు డబ్ల్యు జె రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ కి మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మరియు ఇంచార్జ్ డిపిఆర్ఓ నరేష్ కు ధర్మపురి ప్రెస్ క్లబ్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్వామి వారి సేవలో హైదరాబాద్ సిపి సజ్జనార్



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 24: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని శుక్రవారం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు, స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రచార్యుల ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా సూపరింటెండెంట్ రాజన్ బాబు స్వామివారి లడ్డూ ప్రసాదం, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. వీరి వెంట ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, టౌన్ సిఐ భాస్కర్, ఎస్సై సత్యనారాయణ, ఎస్పీఎఫ్ సిబ్బంది నందు నాయక్ కృష్ణ తదితరులు ఉన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఖానాపూర్ నూతన మున్సిపల్ చైర్‌పర్సన్



నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24(భారత శక్తి): ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అంకం మౌనిక శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు పూలమొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చైర్‌పర్సన్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పారపు సత్యవతి, గుమ్ముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజు ఆర్టీసీ సమ్మెకు బిజెపి నాయకుల సంఘీభావం

## -పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 24: ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడవ రోజు సమ్మె చేస్తున్న కార్మికులకు బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, 41 రోజుల ముందు సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ సమస్యను పట్టించుకోలేదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్టీసీ కార్మికులను చిన్న చూపు చూస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని, కార్మికులతో కలిసి నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. టీజీఎస్ఆర్టీసీ సమ్మెలో భాగంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన కోల శంకర్ గౌడ్ ఫోటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అతని కుటుంబానికి 5 కోట్ల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాశం భాస్కర్, తుమ్మల మురళీధర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు కాదూరి అచ్చయ్య, చందా మహేందర్ గుప్తా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు కమిటీకారి కృష్ణ, తడిసిన మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి సోమా నర్సయ్య, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహా రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆకుల చంద్రమౌళి, నరేష్, అశోక్, సత్యం, శ్యామ్, లెంకలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం: డీజీపీ బీ శివధర్ రెడ్డి.

## ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి.

భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిజం అంతమైందని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసింగ్ లో నూతన మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రగానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళు న్నానని తెలిపారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా ఉంటున్నారని చెప్పారు.

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెలవుల్లో వారు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మూలవాగు పై మూడో బ్రిడ్జి పనులు చేయిస్తున్నామని, రుద్రంగికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు అయిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు. రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టమని పేర్కొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరిలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల సేఫ్టీ కమిటీలకు తెలిపామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

నేరాల నియంత్రణ కోసం..

జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (సూచీూ=) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు. అరైవ్.. అలైవ్ కింద జిల్లాలోని ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని, సీపీఆర్, ప్రాథమిక ఆరోగ్య చికిత్స పై అవగాహన కల్పించామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రేగాను పరామర్శించిన గురిజాల

మణుగూరు, ఏప్రిల్ 24 (భారతశక్తి): మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి పరామర్శించారు. ఇటీవల రేగా కాంతారావు కొంత అస్వస్థతకు గురై హైదరాబాద్ లో చికిత్స పొంది తన స్వగ్రామమైన కరకగూడెంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి రాజకీయాలకు అతీతంగా గురువారం కరకగూడెం వెళ్లి రేగా కాంతారావును పలకరించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నా మానవత్వాన్ని మరువకూడదని గురిజాల స్పష్టం చేశారు. రేగాను పరామర్శించిన వారిలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, బాడిష పార్వతి, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.



# సినిమా




## 15 ఏళ్ల తర్వాత రీఎంట్రీ ఇస్తున్న సమీరా రెడ్డి

టాలీవుడ్‌లో 'జై చిరంజీవ', 'అశోక్' తదితర సినిమాలతో భారీ క్రేజ్ సంపాదించుకున్న అందాల భామ సమీరా రెడ్డి... బాలీవుడ్ లో కూడా పలు చిత్రాల్లో మెరిసింది. అయితే, పెళ్లి తర్వాత తన కుటుంబం కోసం ఆమె సినిమాలకు దూరమైంది. ఇప్పుడు ఆమె సెకండ్ ఇన్నింగ్స్ కు సిద్ధమైంది. సుమారు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వెండితెరపైకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. 2014లో వివాహం తర్వాత సినిమాలకు దూరమైన సమీరా రెడ్డి, ఇప్పుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆఖ్రీ సవాల్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత అభిజీత్ మోహన్ వారంగ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో ఆమె ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారు. ఇకపై రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే నటనకు ఆస్కారం ఉన్న అర్థవంతమైన పాత్రలే చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ప్రయాణం నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం మే 8న విడుదల కానుంది. ఇందులో సంజయ్ దత్ ప్రొఫెసర్‌గా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి కుమారుడు నమాశి చక్రవర్తి ఒక విద్యార్థి పాత్రను పోషిస్తున్నాడు. ఇందిరా గాంధీ హత్య తర్వాతి పరిణామాలు, బాబ్రీ మసీదు కూల్చివేత వంటి కీలక చారిత్రక అంశాలను చూపించనున్నారు.

## ముద్దు సీన్లపై కాజోల్ సంచలన వ్యాఖ్యలు!



బాలీవుడ్ నటి కాజోల్ తన మూడు దశాబ్దాల కెరీర్‌లో మొదటిసారి తన 'నో కిస్సింగ్' పాలసీని పక్కనబెట్టి వార్తల్లో నిలిచారు. తన ఓటీటీ డెబ్యూ సిరీస్ 'ద ట్రయల్' కోసం ఈ నిబంధనను అతిక్రమించి, సహనటుడు జీషూ సేన్ గుప్తాతో కిస్ సీన్‌లో నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఒక యూట్యూబ్ పాడ్‌కాస్ట్‌లో కాజోల్ మాట్లాడుతూ, ఆ సన్నివేశం చిత్రీకరించేటప్పుడు తాను అనుభవించిన మానసిక సంఘర్షణను బయటపెట్టారు. "ఆ సీన్ కేవలం శృంగారం కోసం పెట్టింది కాదు. కథా పరంగా ఆ పాత్రలోని భావోద్వేగాలను పండించడానికి అది చాలా అవసరం. అందుకే కథ విన్నప్పుడు ఓకే చెప్పాను. కానీ సెట్స్‌కి వెళ్ళాక చాలా అసౌకర్యంగా అనిపించింది. చివరి నిమిషంలో 'ఇది చేయను' అని చెప్పేద్దామని అనుకున్నాను. కానీ వృత్తిధర్మం కోసం నా ఇబ్బందిని పక్కనబెట్టి నటించాను" అని ఆమె వివరించారు. 1999లో హీరో అజయ్ దేవగణ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న కాజోల్‌కు నైసా, యుగ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లయిన తర్వాత కూడా నటనలో తనదైన ముద్ర వేస్తున్నారు.




## రంగు తగ్గిపోతోందని గోల్ఫ్ ఆడటం మానేసిన రకుల్..

ఒకప్పుడు దక్షిణాది భాషల్లో వరుస చిత్రాలతో అలరించారు రకుల్ ప్రీత్ సింగ్ . వివాహం అనంతరం అడపాదడపా మాత్రమే పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. అందులోనూ బాలీవుడ్ చిత్రాలకే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన 'పతి పత్నీ ఔర్ వో దో' త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ముదస్సర్ అజీజ్ దర్శకుడు. ఆయుష్మాన్ ఖురానా, సారా అలీ ఖాన్, వామికా గబ్బీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీ ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నాకు మోడలింగ్ అంటే ఎంతో ఆసక్తి. చిన్నప్పటి నుంచి మిస్ ఇండియా ఈవెంట్‌ను ఎంతో ఆసక్తితో చూసేదాన్ని. 1994లో ఐశ్వర్యరాయ్ విజేత అయిన తర్వాత ఆ దిశగా నేనూ నడవాలని అనుకున్నా. ఇదే విషయాన్ని ఇంట్లో చెబితే 'నీకు 18 సంవత్సరాలు వచ్చిన తర్వాత మోడలింగ్ వైపు వెళ్లవచ్చు. అప్పటివరకూ బాగా చదువుకో'అని చెప్పారు. 18ఏళ్లు రాగానే, మరో ఆలోచన లేకుండా దిల్లీలో మోడలింగ్ చేయడం మొదలు పెట్టా. అప్పటికి నేను కాలేజ్‌లో చదువుతున్నాను" "మోడలింగ్ చేస్తున్న సమయంలోనే కన్నడ మూవీలో నటించే అవకాశం వచ్చింది. కానీ, దక్షిణాది ఇండస్ట్రీ గురించి నాకు పెద్దగా తెలియదు. ఎందుకంటే నేను దిల్లీ దాటి బయటకు రాలేదు. పైగా ఆర్మీ కుటుంబం నేపథ్యం కావడంతో ప్రాంతీయ చిత్రాల గురించి తెలియదు. దీంతో నేను హిందీ సినిమాలే చేస్తానని వాళ్లతో చెప్పాను" "ఆ తర్వాత నిర్మాతలు నాన్నతో మాట్లాడారు. పుట్టిన తేదీ చూసి మంచి స్టార్ హీరోయిన్ అవుతుందని చెప్పారు. దాంతో నాన్న నాతో మాట్లాడారు. నెల జీతం తీసుకునే మా కుటుంబానికి రూ.లక్షల్లో పారితోషికం వస్తుందని చెబితే ఆశగానే ఉంటుంది కదా. పైగా ఆ డబ్బుతో నేను కారు కొనుక్కోవాలనుకున్నాను. అయితే, చదువును మధ్యలో ఆపేయడం నాకు ఇష్టం లేదు. అందుకే నటి అవ్వాలన్న నా కలను కాస్త పక్కకు పెట్టి, చదువుపై దృష్టిపెట్టా. ఆ తర్వాతే ముంబయికి వెళ్లా. ఆ తర్వాత జరిగింది అంతా మీకు తెలుసు" "నా 10వ ఏటే నేను గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టా. జూనియర్ నేషనల్ లెవల్ పోటీల్లోనూ ఆడాను. కానీ, మోడల్, నటిగా కెమెరా ముందు మెరవాలనుకున్నాను. పైగా గోల్ఫ్ ఆడటం వల్ల నా శరీర రంగు కూడా మారిపోవడం మొదలైంది. దీంతో గోల్ఫ్ ఆడటం మానేశాను. నేను ప్రొఫెషనల్ గోల్ఫ్ క్రీడాకారిణిని కాకపోయినా, అప్పుడప్పుడూ ఆడుతూనే ఉన్నాను" అని రకుల్ చెప్పుకొచ్చారు.

## మళ్ళీ సితార బ్యానర్‌లో నితిన్..






వరుస పరాజయాలతో సతమతమవుతున్న యంగ్ హీరో నితిన్, ఈసారి పక్కా కమర్షియల్ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. చాలా కథలను తిరస్కరించిన తర్వాత, నితిన్ ఒక కొత్త దర్శకుడి ఫ్యామిలీ డ్రామాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ నెలాఖరులో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం కానుంది. 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'మిరాయ్' చిత్రాలతో ఆకట్టుకున్న రితికా నాయక్ ను ఈ సినిమాలో కథానాయికగా ఎంపిక చేసినట్టు సమాచారం. వరుణ్ తేజ్ సినిమాలతో బిజీగా ఉన్న ఆమెకు నితిన్ సినిమా మరో క్రేజీ ఆఫర్ అని చెప్పొచ్చు. ఇది ఒక స్వచ్ఛమైన ఫ్యామిలీ డ్రామా అని సమాచారం. నితిన్ గతంలో 'అ ఆ' వంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్లతో భారీ విజయాలు అందుకున్న నేపథ్యంలో, ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి.


## తమన్నా బాధపడి ఉంటే.. ఆమె కాళ్లు పట్టుకోడానికైనా సిద్ధమే: నటుడు

బాలీవుడ్ నటుడు అన్నూ కపూర్ (Annu Kapoor) గతంలో తమన్నాను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలైన విషయం తెలిసిందే. తమన్నా బాగా డ్యాన్స్ చేస్తారన్న అన్నూ కపూర్ ఆమె (Tamannaah) చాలా తెల్లగా ఉంటుందని హిందీలో చెప్పారు. అయితే ఈ వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి. దీనిపై తాజాగా వివరణ ఇచ్చారు. తన కామెంట్స్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. ''ఒకవేళ నేను ఇదే మాటను ఇంగ్లిష్‌లో (Milk Body) చెప్పి ఉంటే ఎవరికీ సమస్య ఉండేది కాదేమో. హిందీలో చెప్పేసరికి నా వయసును ప్రస్తావిస్తూ ట్రోల్ చేశారు. కేవలం భాష మారినంత మాత్రాన అర్థం మారిపోదు. ఒక వ్యక్తి రూపాన్ని మెచ్చుకోవడం వేరు.. వారిని దురుద్దేశంతో చూడడం వేరు. నాకు ఆమెపై ఎలాంటి తప్పుడు ఉద్దేశం లేదు. నేను చేసిన కామెంట్స్‌కు ఒకవేళ తమన్నా బాధపడి ఉంటే ఆమె కాళ్లు పట్టుకోవడానికైనా నేను సిద్ధమే. నా మనసులో తప్పుడు ఆలోచనలు లేవు కాబట్టి నాకు ఆమె కాళ్లు పట్టుకోవడం కూడా పెద్ద విషయమేం కాదు'' అని చెప్పారు. 'స్త్రీ 2' సినిమాలోని 'ఆజ్ కీ రాత్' పాట గురించి చర్చిస్తున్న సమయంలో అన్నూకపూర్ ఆమె డ్యాన్స్ గురించి మాట్లాడారు. అదే సమయంలో ఆమె శరీర రంగును కూడా ప్రస్తావించడంతో విమర్శలు ఎదుర్కొన్నారు.










## 'కింగ్'లో దీపిక యాక్షన్ సీన్స్..

షారుక్‌ఖాన్ సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ఫైట్ సన్నివేశాన్ని కూడా సిద్ధార్థ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఈ ఫైట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఈ ఫైట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.

# జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలి

- నిరాధార ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- యువత కబడ్డి క్రీడలో రాణించాలి
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌సి సంతోష్




గజ్వేల్, ఏప్రిల్ 24 (భారత శక్తి): సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వైశ్య భవన్‌లో అన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌సి సంతోష్ కార్యవర్గానికి దిశానిర్దేశం చేశారు. సమ్మర్ శిక్షణ శిబిరాలు నిర్వహించడం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఛాంపియన్‌షిప్ ట్రోఫీ టోర్నమెంట్ నిర్వహించడం, ఈ సంవత్సరంలో పర్మనెంట్ కబడ్డీ గ్రౌండ్ ఏర్పాటు చేయడం, నిత్య శిక్షణ శిబిరాలు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించి, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. అదేవిధంగా పలు కమిటీల ఏర్పాటు కోసం కోర్ కమిటీని ఏర్పాటు చేసి, అందులో సత్యం, రాజు, శ్రీకాంత్, నరేంద్ర బాబు, మహేష్‌లను నియమించారు. అలాగే సిద్దిపేట జిల్లా నుండి అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో అర్హత సాధించిన రాగుల రమ్య, చిల్లి మహేష్‌లను, సీనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న వంశీకృష్ణను జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కుంటనొల్ల శివకుమార్, కార్యవర్గ సభ్యులు సన్మానించి అభినందించారు. ఇక సోషల్ మీడియాలో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్న మేడ్చల్ జిల్లాకు చెందిన వ్యక్తిపై పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి సత్యం, సంయుక్త కార్యదర్శులు రాజు, శ్రీకాంత్, నరేంద్ర బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# అశోక్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మధుయాష్కీ, మల్రెడ్డి. రామ్ రెడ్డి

* ఆనంద్ గౌడ్ మృతిపై సంతాపం.. ధైర్యంగా ఉండాలని సూచన

అబ్దుల్లాపూర్ మెట్: ఏప్రిల్ 24 (భారత శక్తి ): మాజీ సర్పంచ్ బొడిగె అశోక్ గౌడ్ కుమారుడు ఆనంద్ గౌడ్ ఇటీవల మరణించడంతో.. ఆయన కుటుంబాన్ని టీ.పీ.సీ.సీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అబ్దుల్లాపూర్ మెట్ లోని అశోక్ గౌడ్ నివాసానికి వెళ్లిన నేతలు.. ఆనంద్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. చిన్న వయసులో కొడుకును కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ కష్ట సమయంలో అశోక్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విషాదం నుంచి త్వరగా కోలుకోవాలని, ధైర్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: మధుయాష్కి గౌడ్

* ఎల్బీనగర్‌లో దివ్యాంగులకు స్కూటీల పంపిణీ..




ఎల్బీనగర్, ఏప్రిల్ 24 (భారత శక్తి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు త్రిచక్ర వాహనాలు (స్కూటీలు) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి.సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే బాట**

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం పథంలో దూసుకుపోతోందని చెప్పారు. దివ్యాంగులకు వాహనాలతో పాటు భద్రత కోసం హెల్మెట్లను కూడా అందజేసినట్లు తెలిపారు. శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి విధుల్లో సౌలభ్యం కోసం ఫోన్లు పంపిణీ చేశారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు మైనారిటీలకు కుట్టు మిషన్లు, ఈస్కూటర్లు కూడా ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు.

**గడపగడపకూ పథకాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని మధుయాష్కి వివరించారు. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు**

కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, డీడీఆర్సీ రమేష్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, రాగుల వెంకటేశ్వర రెడ్డి, నాయకులు లింగాల కిషోర్ గౌడ్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, రవీందర్ గౌడ్, అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, జయపాల్ రెడ్డి, గణేష్ నాయక్, భవాని శంకర్, ప్రవీణ్ గౌడ్, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# జిహెచ్ఎంసి వినూత్న సేవలు: ఫిర్యాదులకు 'క్యూఆర్' కోడ్!

**GHMC వ్యాప్తంగా 840 కోడ్‌ల ఏర్పాటు**

హైదరాబాద్, ఏప్రిల్ 24 (భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచేందుకు జీహెచ్ఎంసీ (GHMC) సరికొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. పీపీపీపీ (PPPP) కార్యక్రమంలో భాగంగా నగరవ్యాప్తంగా జనం ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో సుమారు 840 క్యూఆర్ (QR) కోడ్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ వినూత్న ఏర్పాట్లు చేశారు.

**ఎక్కడ చూసినా కోడ్‌లే..**

శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో ఈ కోడ్‌లను ఫిక్స్ చేశారు. ముఖ్యంగా
: షాపింగ్ మాల్స్
సినిమా థియేటర్లు
ఫంక్షన్ హాళ్లు
ప్రజా రద్దీ ఉండే ఇతర ప్రాంతాలు

**పనితీరు ఇలా..**

పౌరులు తమ ఫోన్‌తో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తమ సమస్యలు, అభిప్రాయాలు లేదా సూచనలను నేరుగా అధికారులకు పంపవచ్చు. ఈ విధానం వల్ల ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, ఫిర్యాదు అందిన వెంటనే నిర్దిష్ట కాలవ్యవధిలో సమస్యను పరిష్కరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పారదర్శకత కోసమే..**

పాలనలో పారదర్శకత పెంచడంతో పాటు, పౌరులను భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రజలు ఈ వెసులుబాటును వినియోగించుకొని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# నకిలీ పత్రాలతో నయా దందా!

* రాంపల్లి భూ ఆక్రమణ కేసులో నలుగురి అరెస్ట్
* ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ. 73 లక్షల లోన్






కీసర, ఏప్రిల్ 24: భారత శక్తి
విలువైన భూమిపై కన్నేసి, నకిలీ పత్రాలు సృష్టించి, ఏకంగా బ్యాంకులనే బురిడీ కొట్టించిన నలుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. రాంపల్లి గ్రామంలో వెలుగుచూసిన ఈ భూ ఆక్రమణ, ఫోర్జరీ ఉదంతానికి సంబంధించిన వివరాలను మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్ వెల్లడించారు.

**అక్రమ ప్రవేశం.. ధ్వంసం**

రాంపల్లి గ్రామం సర్వే నంబర్ 385లో ఫిర్యాదుదారు రేఖా రెడ్డి కుటుంబానికి చెందిన భూమి ఉంది. ఈ స్థలాన్ని కబ్జా చేసే ఉద్దేశంతో సుబ్బారెడ్డి (A1) తన అనుచరులతో కలిసి అక్రమంగా ప్రవేశించాడు. అక్కడ ఉన్న కాంపౌండ్ వాల్, బోర్ మోటార్‌తో పాటు నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు.

**పథకం ప్రకారం ఫోర్జరీ..**

పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. లోన్ ఏజెంట్ శ్రీధర్ రెడ్డి సలహాతో సుబ్బారెడ్డి, తన అనుచరులు రవి (A2), వెంకటేష్ (A3) సాయంతో నకిలీ భూమి పత్రాలను సృష్టించాడు. జమ్మల నాగేష్ (A4)కు భూమి లేకపోయినప్పటికీ, రిజిస్ట్రేషన్ సమయంలో మరొక గుర్తు తెలియని వ్యక్తిని పంపి, ఫోటోలు, సంతకాలు మార్చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయించారు.

**బ్యాంకుకు కన్నం.. రివర్స్ కేసు**

లోన్ దందా: ఈ ఫోర్జరీ పత్రాలను బ్యాంకులో కుదువ పెట్టిన నిందితులు రూ. 73 లక్షల రుణం పొంది, ఆ మొత్తాన్ని పంచుకున్నారు. బ్లాక్ మెయిలింగ్: భూమి ధర పెరగడంతో అదే నకిలీ పత్రాలతో మరికొందరికి అగ్రిమెంట్లు చేసి వసూళ్లకు పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా, అసలు యజమాని అయిన ఫిర్యాదుదారురాలిపైనే కౌంటర్ కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారు.

**నిందితుల రిమాండ్**

పక్కా ఆధారాలతో సుబ్బారెడ్డి, రవి, వెంకటేష్, జమ్మల నాగేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్.ఐ హరిప్రసాద్ బృందాన్ని డీసీపీ అభినందించారు. కేసులో ప్రమేయం ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

# ఓటర్ల జాబితా ప్రక్షాళన.. మ్యాపింగ్‌కు కసరత్తు

* రంగంలోకి అధికారులు.. కాలనీ అసోసియేషన్లతో భేటీ
* కేబీఆర్ పార్క్ వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు




హైదరాబాద్, ఏప్రిల్ 24 (భారతశక్తి): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR)లో భాగంగా ఓటర్ల జాబితా నవీకరణ, మ్యాపింగ్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి (DEO) ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా విస్తృత చర్యలు చేపట్టారు. ప్రధాన కేంద్రాలు, రద్దీ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

**రంగంలోకి RWAలు, ఉద్యోగ సంఘాలు**

ఓటర్ల మ్యాపింగ్‌పై హైదరాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (RWA), కాలనీ సంఘాల ప్రతినిధులతో అదనపు కమిషనర్ కె. చంద్రకళ, సీఈఓ అబ్దుల్ వకీల్ సమావేశమయ్యారు. 2002 నుండి 2025 మధ్య కాలానికి సంబంధించిన ఓటర్ల వివరాల మ్యాపింగ్‌పై వారికి దిశానిర్దేశం చేశారు. సుమారు 200 మంది ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో.. బూత్ లెవల్ ఆఫీసర్ల (BLO) సమన్వయంతో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని అసోసియేషన్లు హామీ ఇచ్చాయి. మరోవైపు జీహెచ్ఎంసీ ఉద్యోగుల సంఘంతోనూ అధికారులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా మ్యాపింగ్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఏసీ సత్యనారాయణ కోరారు.

**వాకర్స్ కోసం హెల్ప్‌డెస్క్**

ఉదయం వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా కేబీఆర్ పార్క్ వద్ద ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. పార్కుకు వచ్చే వాకర్స్‌కు ఓటర్ల మ్యాపింగ్ ప్రాధాన్యతను వివరిస్తూ, అక్కడికక్కడే నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా వంద శాతం ఖచ్చితత్వంతో రూపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులు స్పష్టం చేశారు.



# వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రధానం

* **యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి**
* **సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ**

దుబ్బాక, ఏప్రిల్ 24 (భారతశక్తి) : యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ అన్నారు.సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వాలీబాల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్కుక్, తొగుట, ధర్మాజీపేట్, మిరుదొడ్డి, మల్లిఆండ, వెంకటపూర్, ఐనాపూర్, మర్పడగా, గుడికందుల, పద్మనాభునిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ట్రాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు కూడా క్రీడల్లో పాల్గొని సందడి చేశారు. పోటీల్లో తుజాల్పూర్ జట్టు మొదటి స్థానాన్ని, తిమ్మాపూర్ యూత్ జట్టు రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. మొదటి బహుమతి విజేతలకు రూ. 10000, రెండో బహుమతి విజేతలకు రూ. 5000 ట్రోఫీలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామాల్లో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో





గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

* **"చింతల చరణ్ " కి సన్మానం**

ఇటీవల చెన్నై లో నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో విజేతగా గెలుపొందిన చింతల చరణ్‌ను తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ వన్నెల విజయ్, పాలకవర్గం సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన చరణ్ తమ గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. తోటి యువత చరణ్ ని ఆదర్శంగా తీసుకోని క్రీడలపై మక్కువ చూపాలని మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసవ్వకూడదని సూచించారు.



# సిద్దిపేట ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్. చత్రపతి

* **యాదవ్‌కు సన్మానం**

సిద్దిపేట , ఏప్రిల్ 24 (భారత శక్తి) : ఉస్మానియా విశ్వవిద్యాలయం పీజీ కళాశాల, సిద్దిపేటకు ప్రిన్సిపాల్‌గా ఆర్. చత్రపతి యాదవ్ నియమితులైన సందర్భంగా పూర్వ విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.పల్లెటూరి ప్రసాద్, బాయికాడి లక్ష్మణ్ తదితరులు కళాశాల ఆవరణలో ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2012లో సిద్దిపేటలో పీజీ కళాశాల స్థాపనకు చత్రపతి యాదవ్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆ కృషికి గుర్తింపుగా ఇప్పుడు ప్రిన్సిపాల్ పదవి దక్కడం గర్వకారణమని అన్నారు. జర్నలిజం విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందించిన ఆయనకు పదోన్నతి రావడం ఆనందదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్ పాల్వాయి, మచ్చ శ్రీహరి, గణేష్, బాబు, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి చివరి గింజ రాష్ట్ర ప్రభుత్వం కొంటుంది

* **కాంగ్రెస్ సర్కార్ రైతు పక్షపాతి**
* **వెంకటాపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**
* **నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ**

సిద్దిపేట,ఏప్రిల్ 24 (భారత శక్తి):రైతులు పండించిన ప్రతి చివరి గింజ రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని, ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ సూచించారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి చివరి గింజ వరకూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ





ప్రధాన ధ్యేయమని అన్నారు.ఐకేపీ కేంద్రాల్లో రైతులకు అవసరమైన నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తేమ శాతం నిర్దేశిత స్థాయికి చేరగానే వడ్లను వెంటనే పారదర్శకంగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తేమ కొలిచే పరికరాలు, కాంటాలు, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ సుమన్, వార్డ్ సభ్యులు గజ్జల స్వామి, ఎర్ర కృష్ణ, సత్తవ్వ, చామంతి, ఎర్ర ప్రభాకర్, నాగరాజు, బండ చంద్రకళ, గ్రామ శాఖ అధ్యక్షులు దుబ్బ దుర్గయ్య, ఎండీ రాజ్ మహమ్మద్, పోతుగంటి శ్రీకాంత్, ఏఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, గుర్రం అంజిరెడ్డి, దాస్ అంజన్న, డీసీసీ బుడ్డమ్మ లక్ష్మి, అల్ల శ్రీనివాస్ రెడ్డి, పంతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు అండగా కత్తి కార్తిక గౌడ్.. రేవంత్ సర్కార్‌పై ఫైర్

సిద్దిపేట ,ఏప్రిల్ 24 (భారత శక్తి) : తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. విలీనం హామీ నెరవేరక, జీతాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2023లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది చట్టంగా కూడా మారింది. అయితే



రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ఆ చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కార్తిక గౌడ్ మండిపడ్డారు.ఈ ఆలస్యం కారణంగా ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని ఘటనలు ఆత్మహత్యలకు దారితీయడం అత్యంత బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని, ఇకనైనా మేల్కొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్తిక గౌడ్ డిమాండ్ చేశారు. విలీన ప్రక్రియను వెంటనే పూర్తి చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని ఆమె హెచ్చరించారు.



# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి..

* **సరూర్ నగర్ తహసీల్దార్ వేణు గోపాల్ పలు సూచనలు**

ఎల్బీనగర్,ఏప్రిల్ 24 (భారత శక్తి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సరూర్ నగర్ తహసీల్దార్ పి.వేణుగోపాల్ సూచించారు.మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం, సరూర్ నగర్ మండలానికి సంబంధించిన సహాయ ఎన్నికల నమోదు అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరిని 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేయాలని తెలిపారు.మ్యాపింగ్ ప్రక్రియ 53 శాతమే అయిందని, మిగతా ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని పేర్కొంటూ బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించి వారంలోగా మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏల సహకారం తీసుకోవాలని, రెసిడెన్షియల్ కాలనీల్లో సమావేశాలు నిర్వహించి ప్రతి ఓటరు మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కూడా సహకరించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు కూడా బిఎల్ఓలను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జ్యోతితో కలిసి స్వయంగా సరూర్నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని 8 ఓటింగ్ బూత్ లోని ఓటర్ ఇంటికి వెళ్లి బిఎల్ఓతో కలిసి మ్యాపింగ్ గురించి వివరించి, పలు సూచనలు చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

* **వాసవి మాత జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రకటించడంపై ఆర్యవైశ్యుల హర్షం**

గజ్వేల్, ఏప్రిల్ 24 (భారత శక్తి) : కన్యాకా పరమేశ్వరి వాసవి మాత జయంతిని తెలంగాణ రాష్ట్ర అధికారిక వేడుకగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్య గారి శేఖర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ ఎం సీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ,కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, సిద్ది బిక్షపతి, ఏర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ద్వారా ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి సముచిత గౌరవం కల్పించారని నాయకులు కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని కులాలకు, వర్గాలకు న్యాయం






జరుగుతుందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల చిరకాల కోరికను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# త్రై బజార్ వేలం పాట వాయిదా

- **సిద్దిపేట కమిషనర్ అశ్రీత్ కుమార్**


సిద్దిపేట, ఏప్రిల్ 24 (భారత శక్తి) : సిద్దిపేట పురపాలక సంఘం పరిధిలో నిర్వహించాల్సిన త్రై బజార్ వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు కమిషనర్ అశ్రీత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చిరు వ్యాపారుల నుంచి వ్యాపార నిర్వహణ రుసుమును సేకరించి, ఆ ప్రాంత నిర్వహణకు వినియోగించేందుకు ఈ వేలం పాటను నిర్వహించాల్సి ఉండగా, ముందుగా నిర్ణయించిన 24042026 తేదీకి బదులుగా ఇప్పుడు 01052026 రోజున మధ్యాహ్నం 4:00 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు



ఈ నెల 30042026లోపు పురపాలక సంఘం పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ (DD) చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పురపాలక సంఘం కార్యాలయాన్ని సంప్రదించవచ్చని కమిషనర్ తెలిపారు.

# రెడ్డి బ్రదర్స్ లైన్ లో రోడ్ల అక్రమణల తొలగింపు

ఎల్బీనగర్, ఏప్రిల్ 24 (భారత శక్తి): సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశానుసారం టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాం నగర్ కాలనీలోని రెడ్డి బ్రదర్స్ వీధిలో రోడ్లు ఆక్రమణలు తొలగించారు. మొత్తం 26 చోట్ల రోడ్లు పూర్తిగా అక్రమణకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని గుర్తించి పూర్తిగా తొలగించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో టిపిఎస్ సాయి అర్చన, న్యాక్ ఇంజినీర్ సురేష్, రాము, సాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కొత్త AI 'మిథోస్' కలకలం.. బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

"క్లాడ్ మిథోస్" అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి పొంచి ఉన్న సైబర్ ముప్పుపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఆంత్రోపిక్ అనే AI స్టార్టప్ అభివృద్ధి చేసిన 'క్లాడ్ మిథోస్' సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది కనుగొన్నట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ AIని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERTIn) వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (IBA)కు మంత్రి సూచించారు. కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా 'మిథోస్' ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ AI వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) అధ్యయనం చేస్తున్నాయి.

## చర్చలే మార్గం.. ఆత్మహత్యలు వద్దు

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి జేఏసీ నేతలతో భేటీ అయిన ఆయన, సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. ఇది మనందరి 'ప్రజా ప్రభుత్వం' అని, ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమకు లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందని, అప్పట్లో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని అన్నారు. తాము అలా చేయబోమని భరోసా ఇచ్చారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ పనుల వల్ల తాము బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే శంకర్ గౌడ్ ను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## మే 4 తర్వాత లెక్క తేలుస్తాం
## మోదీ హెచ్చరిక

మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

## శంకర్ గౌడ్ ది సర్కార్ హత్యే: కేటీఆర్

నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'హత్య' అని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో ఒక 'చీకటి రోజు' అని, అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2011లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌కు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. నాడు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో వీరికి ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం వారిపై నమోదైన కేసులను కొట్టివేసింది.

## మొజ్తబా ఖమేనీకి ప్లాస్టిక్ సర్జరీ?

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారు, స్పృహలోనే ఉన్నారు. కానీ ఓ దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఆయన ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలను 'ది న్యూయార్క్ టైమ్స్' తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది.

**తీవ్ర గాయాలు.. రహస్య పాలన**

పత్రిక కథనం ప్రకారం మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. అయితే, ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయెల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని రిపోర్ట్ తెలిపింది.

**అధికారం జనరల్స్ చేతిలోకి..**

ఖమేనీకి కమ్యూనికేషన్ పరిమితం కావడంతో, దేశంలో అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి వెళ్లింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్లు ఇప్పుడు యుద్ధం, దౌత్యం, జాతీయ భద్రత వంటి కీలక అంశాలపై పూర్తి పట్టు సాధించారు. "మొజ్తబా ఒక బోర్డు డైరెక్టర్‌లా వ్యవహరిస్తుంటే, జనరల్స్ బోర్డు సభ్యులుగా మారి అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు" అని మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనెజాద్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ మార్పుతో దేశాధ్యక్షుడు మసూద్ పెజెస్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వంటి పౌర నాయకులు కీలక నిర్ణయాల్లో నామమాత్రంగా మారారు. వారు కేవలం దేశీయ వ్యవహారాలకే పరిమితమయ్యారు. అమెరికా నావికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పుడు చర్చలు వద్దని సైనిక కమాండర్లు వ్యతిరేకించడంతో, అమెరికాతో జరగాల్సిన చర్చలు కూడా విఫలమయ్యాయి. మొత్తంగా ఇరాన్‌లో పాలన మారనప్పటికీ, అధికారం ఒక వ్యక్తి చేతి నుంచి సైనిక కూటమి చేతికి బదిలీ అయిందని, వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని న్యూయార్క్ టైమ్స్ కథనం స్పష్టం చేసింది.

## ట్రంప్‌కు ముంబైలోని ఇరాన్ ఎంబసీ వీడియోతో కౌంటర్


చైనా, భారతదేశాలను నరకంతో పోలుస్తూ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ చేసిన వ్యాఖ్యల లేఖను రీపోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ముంబైలోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ట్రంప్ ఒకసారి భారత్ వచ్చి చూడాలని ఆ తర్వాత ఈ దేశం గురించి మాట్లాడాలని వ్యాఖ్యానించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పోస్టు చేసింది. భారతదేశంలోని అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌నకు తెలిసేలా ఎవరైనా ఆయనను భారతదేశ పర్యటనకు తీసుకువస్తే బాగుండేదని పోస్టులో పేర్కొంది. ఈ వీడియోలో మహారాష్ట్రలోని అత్యాధునిక సదుపాయాలు, సంప్రదాయ వేడుకలు, పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది. మహారాష్ట్రలోని అత్యంత ఎత్తైన భవంతులు, ఆధునిక రహదారులు, వినాయక నిమజ్జనంను ఈ వీడియోలో పొందుపరిచింది. ఇంకోవైపు, కొండలు, కోనలు, వాగులు, వంకలతో అద్భుతమైన సుందర ప్రదేశాలు ఉన్నాయని పేర్కొంది.

## తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఓటింగ్ శాతం పెరగడం శుభపరిణామమన్న రాంచందర్ రావు

తమిళనాడులో మొత్తం అసెంబ్లీ స్థానాలకు, పశ్చిమబెంగాల్ లో తొలి విడత ఎన్నికలకు నిన్న పోలింగ్ జరిగింది. అయితే, ఊహించని స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీల్లో టెన్షన్ మొదలయింది. అనూహ్యంగా పెరిగిన ఓటింగ్ శాతం ప్రస్తుత ప్రభుత్వాలకు అనుకూలంగా పడిందా? లేక వ్యతిరేకంగా పడిందా? అనే చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. తమిళనాడు (84.80%), పశ్చిమ బెంగాల్ (91.91%)లలో నిన్న జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదు కావడంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఇంత భారీ స్థాయిలో ఓటింగ్ జరగడం అనేది ప్రజలు ప్రస్తుత వ్యవస్థలో మార్పును కోరుకుంటున్నారని స్పష్టం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఓట్లు ప్రభుత్వాల మార్పు కోసమే పడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన (SIR)ను ఆయన అభినందించారు. డూప్లికేట్ ఓట్లు, అక్రమ ఓట్లు, చనిపోయిన వారి పేర్లను తొలగించడం ద్వారా 'క్లీన్' ఓటర్ లిస్ట్ సిద్ధమైందని, ఆ తర్వాత కూడా ఓటింగ్ శాతం పెరగడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని పేర్కొన్నారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, తద్వారా అసలైన ఓటర్లకు న్యాయం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు.

## హుగ్లీ నదిలో ప్రధాని నరేంద్ర మోదీ పడవ ప్రయాణం

ప్రధానమంత్రి నరంద్ర మోదీ శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. పడవ నడిపేవారితో, మార్నింగ్ వాక్ చేసే వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. హుగ్లీ నదిలో బోట్ రైడ్ చేసిన మోదీ, కెమెరా చేతబట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతిలో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకు వెళ్తున్నాయని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం కొద్దిసేపు హుగ్లీ నది తీరంలో గడిపినట్లు పేర్కొన్నారు. పడవ నడిపే వారితో, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని మోదీ ప్రశంసించారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తమ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందని అన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చారిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌరా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



# పడకపోతే.. కలపకూడదట!


**మన నిత్య జీవితంలో పెరుగును చాలా వంటకాల్లో భాగం చేస్తుంటాం. అయితే కొన్ని పదార్థాలతో పెరుగును కలిపి తీసుకోవడం వల్ల కొంతమందికి పడకపోవచ్చని, అలాంటి సందర్భాలలో అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.**

* చేపలు, పెరుగు.. ఈ రెండూ కలిపి తీసుకోకూడదన్న విషయం చాలామందికి తెలిసిందే! ఎందుకంటే ఈ రెండింటిలోనూ ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. తద్వారా అజీర్తి సమస్య తలెత్తుతుంది. అంతేకాదు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఇతర మాంసాహారంతోనూ దీన్ని కలపకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.
* మినపప్పుతో చేసిన పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకుంటే కొంతమందిలో విరేచనాలు, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయట!
* నూనె పదార్థాలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుందని చెబుతున్నారు నిపుణులు. అలాగే ఈ కాంబినేషన్ కొందరిలో బద్ధకం, మగత వంటి వాటికి కారణమవుతుందట.
* పెరుగుతో తయారుచేసే రైతాలో ఉల్లిపాయలు వేయడం చాలామందికి అలవాటే! అయితే ఈ కాంబినేషన్ కూడా కొందరికి పడకపోవచ్చంటున్నారు నిపుణులు. ఈ రెండూ కలవడం వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు, చర్మ అలర్జీలు వంటివి వచ్చే అవకాశాలున్నాయట!
* కాబట్టి ఆయా పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకున్నప్పుడు ఏదైనా అసౌకర్యం అనిపిస్తే.. అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదన్నది నిపుణుల సలహా.

# నిబంధనలు గాలికి.. నివాసితులకు ప్రాణసంకటం!

ఎల్.బి. నగర్ , ఏప్రిల్ 24 (భారతశక్తి) : నమిశ్రీ అంటేనే మోసం, ద్రోహం దారుణం అన్న పదాలను శిరోధార్యం వహించి సామాన్య జనాన్ని ఇబ్బంది పెడుతున్న ఈ సంస్థ చేస్తున్న దారుణాలను ఆపే నాథుడే లేడా ..! ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయింది..!

భారీ క్రేన్ల భీకర శబ్దాలు.. కళ్లు మూసి తెరిచేలోపు కమ్ముకుంటున్న దుమ్ము ధూళి.. ఇంటి గోడలపై ప్రత్యక్షమవుతున్న భారీ పగుళ్లు.. ఇది ఎల్.బి. నగర్ సర్కిల్, లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మైత్రినగర్ కాలనీ వాసుల దైనందిన నరకం. గతంలో 'ప్రైమ్ గార్డెన్' ఉన్న స్థలంలో చేపట్టిన నమిశ్రీ జ్వేల్ (26 అంతస్తులు) నిర్మాణ ఉదంతం ఇప్పుడు స్థానిక నివాసితుల ప్రాణాల మీదకు తెస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ నిర్మాణంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.


Date 06/06/2025
To
The Deputy commissione
LBnagar circle

### రక్షణ కరువై.. గోడలు పగిలి!

నిర్మాణ సంస్థ నిబంధనల ప్రకారం కనీస రక్షణ చర్యలు చేపట్టకుండానే భారీ సెల్లార్ తవ్వకాలను చేపట్టింది. సుమారు 12 అడుగులకు పైగా లోతుగా భూమిని తవ్వడంతో, ఆ పక్కనే ఉన్న మైత్రినగర్ రోడ్ నెం. 8 లోని ఇళ్ల పునాదులు కదులుతున్నాయి. మేకల చంద్రకాంత్ రెడ్డి వంటి బాధితులు తమ ఇళ్ల గోడలకు నిలువునా పగుళ్లు రావడంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయంపై బిల్డర్‌ను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పాల్సింది పోయి బాధితులపైనే దురుసుగా ప్రవర్తిస్తుండటం గమనార్హం.

### కాలుష్య కోరల్లో కాలనీ..

* ధ్వని కాలుష్యం: భారీ క్రేన్లు, క్రషర్ మిషన్ల వినియోగంతో పగలు, రాత్రి తేడా లేకుండా వస్తున్న శబ్దాలతో వృద్ధులు, అనారోగ్య బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
* గాలి కాలుష్యం: కనీస వాటర్ స్ప్రింక్లర్లు (నీటిని చల్లడం) వాడకపోవడంతో దుమ్ము ధూళి రేగి గాలి నాణ్యత పడిపోతోంది. ఫలితంగా స్థానికులు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు.

### చట్టం ఏం చెబుతోంది?

మున్సిపల్ చట్టాల ప్రకారం (TSbPASS మరియు GHMC నిబంధనలు), ఏదైనా భారీ నిర్మాణం చేపట్టినప్పుడు చుట్టుపక్కల ఇళ్లకు ఎటువంటి నష్టం కలగకుండా షోరింగ్ (Shoring) లేదా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలి.

* సెక్షన్ 452, 461: అనుమతులకు మించి తవ్వకాలు జరిపినా లేదా ప్రాణాపాయ స్థితి కల్పించినా తక్షణమే నిర్మాణాన్ని నిలిపివేసి, బిల్డర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు.
* పర్యావరణ నిబంధనలకు విఘాతం: నిర్మాణ ప్రాంతం చుట్టూ ఎత్తైన రేకులు (Barricading) అమర్చాలి మరియు ధూళి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక్కడ ఇవేవీ కానరావడం లేదు.













### అధికారుల నిర్లక్ష్యం - పాలకుల మౌనం!

ఈ అక్రమాలపై స్థానిక మున్సిపల్ అధికారులకు మరియు ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్‌కు ఫిర్యాదులు అందినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. "మా ఇళ్లు మా కళ్లముందే కూలిపోయేలా ఉన్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి గారు స్పందించి, తక్షణమే నిర్మాణాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారు.



## తెలంగాణ రెడ్డి సంఘం
# కేంద్ర కార్యాలయం ప్రారంభం...

* **పేద రెడ్లు, పేద రెడ్డి విద్యార్థులు ఏ సహాయం కావాలన్నా సంప్రదించండి : బద్దూరి హామీ**

ఎల్బీనగర్, ఏప్రిల్ 24 (భారత శక్తి): తెలంగాణ రెడ్డి సంఘం అడ్ హాక్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా రెడ్ల సంక్షేమం కోసం శుక్రవారం హైదరాబాద్ చంపాపేట్ లోని జిట్టా యాదవ్ రెడ్డి భవన్ లో తెలంగాణ రెడ్డి సంఘం కేంద్ర కార్యాలయం అడ్ హాక్ కమిటీ చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని సంఘాలు ఏకతాటిగా దిగి రావడం ఒకే సంఘం ఏర్పాటు చేయటం శుభ సూచకం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ పాలక వర్గాన్ని కూడా నియమిస్తారని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెడ్డి బంధువులందరూ మంచి చెడులకు విద్య మరియు వైద్య ఉద్యోగ వివిధ రంగాల్లో నిరుపేద విద్యార్థిని విద్యార్థులు వారి అవసరాలను కేంద్ర కార్యాలయానికి తెలియజేస్తే ఇక్కడ నుండి వారికి సహాయ సహకారాలు తమ వంతుగా అందజేస్తామని ఈ సందర్భంగా చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రెడ్లందరూ ఒకటే, రెడ్డి సంఘం ఒక్కటే అనే నినాదంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఉన్న జిల్లా మరియు మండల స్థాయి, గ్రామ స్థాయి సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్తామని అన్నారు. పేద రెడ్ల కోసం పేద రెడ్డి విద్యార్థుల కోసం సంఘం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు కొట్టం మధుసూదన్ రెడ్డి, నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్నెపల్లి లింగారెడ్డి, మడప కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్య సలహాదారులు బొక్క భూపాల్ రెడ్డి నావల్గా సత్యనారాయణ రెడ్డి, పడిదం కృష్ణారెడ్డి, కొమ్మడి వెంకట్ రెడ్డి, పెండల కేశవ బొబ్బిలి దామోదర్ రెడ్డి, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, నల్ల సంజీవ రెడ్డి, నందికొండ శ్రీనివాస్ రెడ్డి, కో కన్వీనర్లు గంగుల శ్రీలత రెడ్డి, నూకల పద్మా రెడ్డి, నందికొండ గీతా రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, రజిత రెడ్డి, దేవిరెడ్డి శ్వేతా రెడ్డి, స్వాతి రెడ్డి, సభ్యులు మేక సోమిరెడ్డి, రణధీర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితర రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు.. సర్కార్ చేసిన 'హత్య'!

* **ఓట్ల కోసం విలీనం జపం.. బకాయిల కోసం కార్మికుల తపం**
* **'మహాలక్ష్మి' ముసుగులో వెట్టిచాకిరీ.. ₹1000 కోట్ల బాకీ ఎప్పుడు కడతారు?**
* **పీఆర్సీ ఫైలుపై పాలకుల నిద్ర.. రోడ్డెక్కిన డ్రైవర్ల రుద్ర నిరసన..**
* **బీ.సీ బిడ్డ బలిదానానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందే: అల్లంపల్లి రామ్‌కోటి ఆగ్రహం**




హైదరాబాద్ : ఏప్రిల్ 24(భారత శక్తి బ్యూరో): రాష్ట్రంలో రవాణా వ్యవస్థను నడిపిస్తున్న ఆర్టీసీ కార్మికుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. నాడు అధికారంలోకి రావడానికి 'విలీనం' మంత్రాన్ని జపించిన పాలకులు, నేడు అదే కార్మికులను నట్టేట ముంచుతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామ్‌కోటి ధ్వజమెత్తారు. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగత కారణాలతో చేసుకున్న ఆత్మహత్య కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'వ్యవస్థీకృత హత్య' అని ఆయన మండిపడ్డారు.

### హామీలన్నీ అటకెక్కాయ్..!

ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని రామ్‌కోటి విమర్శించారు. నాన్చుతున్న పీఆర్సీ: విలీనం పేరుతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం, సవరించిన వేతనాల (PRC) ఫైలును సచివాలయంలో పక్కన పడేసిందని దుయ్యబట్టారు.

* వేల కోట్ల బకాయిలు: 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న బాండ్లు, డీఏ బకాయిలు కలిపి సుమారు ₹ 1,000 కోట్లు చెల్లించకుండా కార్మికుల కడుపు కొడుతున్నారని ఆరోపించారు.
* బిక్కుబిక్కుమంటూ డ్యూటీలు: కండిషన్ లేని బస్సులు, స్పేర్ పార్ట్స్ దొరకని వైనం.. వెరసి డ్రైవర్ల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### 'మహాలక్ష్మి' భారం.. డ్రైవర్లపై ప్రతాపం!

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా ప్రభుత్వం రాజకీయంగా పేరు తెచ్చుకుంటోంది కానీ, ఆ పథకం భారాన్ని మోస్తున్న కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదని రామ్‌కోటి నిలదీశారు.

* పెరిగిన ఒత్తిడి: బస్సుల్లో రద్దీ 50 శాతం పెరిగినా, కొత్త బస్సులను కొనకుండా పాత బస్సులతోనే డ్యూటీలు చేయిస్తున్నారని విమర్శించారు.
* విశ్రాంతి లేని బతుకులు: 12 గంటల పాటు లంచ్ బ్రేక్ లేకుండా పని చేయాల్సి రావడం వల్ల కార్మికులు మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారని, శంకర్ గౌడ్ బలిదానానికి ఇదే ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు.

### సర్కార్‌కు రామ్‌కోటి డిమాండ్లు:

1. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా: శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.
2. బకాయిల చెల్లింపు: ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న ₹ 1,000 కోట్ల బకాయిలను వడ్డీతో సహా విడుదల చేయాలి.
3. కొత్త నియామకాలు: పని భారాన్ని తగ్గించేందుకు ఖాళీగా ఉన్న 5,000 పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
4. పీఆర్సీ ప్రకటన: పీఆర్సీ అమలుపై స్పష్టమైన గడువు ప్రకటించి కార్మికుల్లో భరోసా నింపాలి.

### కార్మికులకు పిలుపు:

"న్యాయమైన హక్కుల కోసం పోరాడుదాం.. కానీ ప్రాణాలు తీసుకోవద్దు" అని రామ్‌కోటి కార్మికులకు విన్నవించారు. శంకర్ గౌడ్ మరణం తెలంగాణ సమాజానికి కనువిప్పు కావాలని, కార్మికుల పక్షాన బీసీ సంక్షేమ సంఘం అండగా ఉంటుందని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# బీడీ కార్మికులకు అండగా సంజీవని శక్తి

* **కిట్ల పంపిణీ చేసిన కత్తి కార్తిక గౌడ్**



సిద్దిపేట ,ఏప్రిల్ 24 ( భారత శక్తి): ప్రతి బీడీ వెనుక ఒక తల్లి కథ... ఆమె ఆరోగ్యం మన బాధ్యత" అనే నినాదంతో టీమ్ కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు సంజీవని శక్తి కిట్లు పంపిణీ చేశారు. దుబ్బాక మండలం శిలాజి నగర్ తాండ గ్రామంలో బీడీ ఖర్కానాను సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ మహిళా బీడీ కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా బీడీలు చుడుతూ కుటుంబ భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న అక్కచెల్లెళ్ల ఆరోగ్యం నెమ్మదిగా దెబ్బతింటోందని, అందుకే వారి ఆరోగ్య పరిరక్షణ కోసం సంజీవని శక్తి కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. "ఈ సంజీవని కిట్ మీ ఊపిరిలో బలాన్ని, మీ గుండెల్లో ధైర్యాన్ని నింపుతుంది. మీకు తోడుగా మీ బిడ్డగా నేను మీతో ఉన్నాను" అని కార్తిక గౌడ్ హామీ ఇచ్చారు. కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దేవేందర్, సర్పంచ్ బానోతు సునీత సంతోష్, ఉప సర్పంచ్ భవిష బాబు, మహేందర్ గౌడ్, పరశురామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పథకానికి పాతరేస్తున్న కేంద్రం

**- కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ**

**- కాంగ్రెస్ నేత కమలాకర్ ఆరోపణ**




సిద్దిపేట, ఏప్రిల్ 24 ( భారత శక్తి ) : కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఏలూరి కమలాకర్ మాట్లాడుతూ.. గతంలో కరువు పరిస్థితులు, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, ఉపాధి కోసం వలసలు వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని యూపీఏ ప్రభుత్వం హయాంలో ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన నిధుల విధానాన్ని మార్చి, రాష్ట్రాలపై భారాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటోందని ఆయన విమర్శించారు. అలాగే మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పనులను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, పథకాన్ని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మంద చెంద్రసాగర్, ప్రభాకర్ చారి, మైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.